శనివారం
13-05-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 320
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కన్నడ ఓట్ల లెక్కింపు నేడే

ఫలితాలపై బీజేపీ, కాంగ్రెస్ గంపెడాశ

కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శనివారం వెలువడనున్నాయి. ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేసింది.

2లో

వైసీపీ ప్రభుత్వానికి చెంపపెట్టు : సీపీఐ నేత రామకృష్ణ

జీవో నంబరు 1ని కొట్టేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ప్రాథమిక హక్కులను కాలరాసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విపక్షాలన్నీ విమర్శించినా, జీవోను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రజలంతా ఉద్యమాలు నిర్వహించినా ప్రభుత్వం పట్టించుకోలేదని, చివరకు ఇప్పుడు హైకోర్టు కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా విజ్ఞత ప్రదర్శించి ప్రతిపక్షాలను, ప్రజాసంఘాలను గౌరవించాలని, ప్రజా ఉద్యమాలపై పోలీసులను ప్రయోగించి, ఉక్కుపాదం మోపటం మానాలని హితవు చెప్పారు.

అంతిమంగా గెలిచేది అంబేద్కర్ రాజ్యాంగమే : చంద్రబాబు



దేశంలో అంతిమంగా గెలిచేది... నిలిచేది అత్యున్నతమైన అంబేద్కర్ రాజ్యాంగమే. జగన్ లాంటి నాయకులు వస్తారని నాడే ఊహించి... భారత రాజ్యాంగంలో పౌరుల ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించారు. ప్రజాస్వామ్యం మహోన్నతమైనది. అధికారం తెచ్చిన అహంకారం, నియంత ఆలోచనలు దాని ముందు నిలబడవని మరోసారి స్పష్టమైంది. ప్రజలను, ప్రతిపక్షాలను, ప్రజా సంఘాలను ప్రజా వ్యతిరేక ప్రభుత్వంపై గొంతెత్తకుండా చేయాలనే దురుద్దేశంతో వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవో నంబర్ 1 ను హైకోర్టు కొట్టి వేయడాన్ని స్వాగతిస్తున్నామని టీడీపీ అధినేత చంద్రబాబు తెలిపారు.

ఇది ప్రాథమిక హక్కులకు విఘాతం

జీవో నంబర్ 1ను కొట్టేస్తూ హైకోర్టు తీర్పు

ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేసిన సీపీఐ నేత రామకృష్ణ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటూ తరచూ హైకోర్టుతో అక్షింతలు వేయించుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆందోళనలను అణచివేసే ఉద్దేశంతో వారు నిర్వహించే రోడ్ షోలు, బహిరంగ సభలను కట్టడి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 1ను హైకోర్టు శుక్రవారం కొట్టేసింది. ఈ జీవో ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా ఉందని ఉన్నత న్యాయస్థానం అభిప్రాయపడుతూ జీవో కొట్టేస్తున్నట్లు తీర్పు వెలువరించింది. ఈ ఏడాది జనవరి 2న రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 1ను తీసుకొచ్చింది. దానిని సవాల్ చేస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హైకోర్టులో పిల్ వేశారు. ఇదే జీవోను సవాలు చేస్తూ మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర, ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గిడుగు వీర వెంకట రుద్రరాజు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రబాబు హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేశారు. ప్రతిపక్షాలు రోడ్డుపై నిర్వహించే కార్యక్రమాలను జీవో నంబర్ 1 పేరుతో అడ్డుకునే ప్రమాదం ఉందని, అందువల్ల దాన్ని రద్దు చేయాలని కోరారు. ఆ వ్యాజ్యాలపై జనవరి 24న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులుతో కూడిన ధర్మాసనం లోతైన విచారణ జరిపి తీర్పును రిజర్వు చేసింది. తాజాగా దీనిపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. రామకృష్ణ తరఫున న్యాయవాది అశ్వినీకుమార్ వాదనలు వినిపించారు. రోడ్ షోలను కట్టడి చేసేలా జీవో ఉందని, ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే జీవో తెచ్చారని, పోలీస్ యాక్ట్ 30కు భిన్నంగా జీవో నంబర్ 1 జారీ చేశారని న్యాయవాది వాదనలు వినిపించారు. రెండు వైపులా వాదనలు విన్న అనంతరం హైకోర్టు ఈ మేరకు జీవో నంబరు 1ని కొట్టివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

ఇకనైనా నిరంకుశ పోకడలు మానాలి : సీపీఎం నేత శ్రీనివాసరావు

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబరు 1ను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ప్రజాసమస్యలపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయకుండా రాజకీయ పార్టీలను, ప్రజాసంఘాలను నిరంకుశంగా అణచివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో నంబరు 1ని అడ్డంపెట్టుకుని ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలకు పాల్పడింది. ప్రజల నిరసనలను లెక్కచేయని వైసీపీ ప్రభుత్వానికి ఈ తీర్పు చెంపపెట్టు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ పోకడలు విడనాడి పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడే చర్యలు చేపట్టాలని కోరారు.

ఇది ప్రజా విజయం : కాంగ్రెస్ నేత రుద్రరాజు

రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా తీసుకొచ్చిన జీవో నంబరు 1ని హైకోర్టు కొట్టేయడం ప్రజా విజయంగా ఏపీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. జీవో నంబరు 1పై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సవాల్ చేసిన పిటీషన్‌పై రుద్రరాజు ఇంప్లీడ్ పిటీషన్ దాఖలు చేశారు.

పిచ్చి కుక్క కాటుకి ఆలస్యంగానైనా చెప్పు దెబ్బ : ఎంపీ రఘురామ

హైకోర్టులో జీవో నంబరు 1 కొట్టివేతపై ఎంపీ రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ పిచ్చి కుక్క కాటుకి ఆలస్యంగానైనా చెప్పు దెబ్బ తగిలిందన్నారు. ఇకనుంచైనా ప్రభుత్వం తింగరి వేషాలు మానెయ్యాలని సూచించారు. ఈ మధ్య కాలంలో ఎన్నో అరాచకాలు చేశారని, మరో సీఎం ఉంటే ఈపాటికే రాజీనామా చేసేవారని తెలిపారు.

ఆదుకోమంటే అరెస్టులా?

అన్నదాత గోడు పట్టదా

- కేవీవీ ప్రసాద్, ముప్పాళ్ల ఆగ్రహం
- మంగళగిరిలో సీపీఐ, రైతు నేతల అరెస్టు

విశాలాంధ్ర-మంగళగిరి/తాడేపల్లి: అకాల వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోమని అడిగితే అరెస్టు చేయడం దుర్మార్గమని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. పంటనష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతూ సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అధ్వర్యంలో శుక్రవారం సీఎం కార్యాలయ ముట్టడికి సమాయత్తమయ్యారు. కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి రైతుసంఘం, సీపీఐ నాయకులు, కార్యకర్తలు మంగళగిరిలోని వేములపల్లి శ్రీకృష్ణభవన్‌కు ఉదయాన్నే పెద్దఎత్తున చేరుకున్నారు. పార్టీ కార్యాలయం నుంచి పాదయాత్రగా సీఎం కార్యాలయానికి చేరుకుని ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేయాలని నాయకులు భావించారు. అయితే, అప్పటికే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు సీపీఐ, రైతుసంఘం నాయకులు, కార్యకర్తలను అడ్డుకుని బలవంతంగా లాక్కెళ్లి వ్యానులో ఎక్కించి దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ అకాల వర్షాలకు రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, మామిడి, ఉద్యానవన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, పసుపు, మొక్కజొన్న కొనుగోలు చేసే పరిస్థితి లేక రైతులు అల్లాడుతున్నారన్నారు. పండించిన పంటను

- మిగతా 2 లో

నాలుగు వారాల్లో
కౌంటర్ దాఖలు

ఆస్తుల విభజనపై తెలంగాణ, కేంద్రానికి సుప్రీం తుదిగడువు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆస్తుల విభజనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని సుప్రీం కోర్టు శుక్రవారం ఆదేశించింది. రాష్ట్ర విభజన జరిగి 9 సంవత్సరాలు పూర్తయినా ఇంతవరకు హైదరాబాద్‌లోని షెడ్యూలు 9,10లోని వివిధ సంస్థలకు సంబంధించిన ఆస్తుల విభజన ప్రక్రియ పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో ఆస్తుల విభజనపై ఏపీ దాఖలు చేసిన పిటీషన్‌పై శుక్రవారం సుప్రీంలో విచారణ జరిగింది. ఏపీ పిటీషన్‌పై కౌంటర్ దాఖలుకు తెలంగాణ, కేంద్రానికి సుప్రీం నాలుగు వారాల గడువు ఇచ్చింది. షెడ్యూల్ 9,10 లలో ఉన్న సుమారు 1.4 లక్షల కోట్ల ఆస్తుల విభజన జరగలేదని సుప్రీంను ఏపీ ప్రభుత్వం ఆశ్రయించగా, దీనిపై ఇప్పటికే కేంద్రానికి, తెలంగాణకు నోటీసులు

- మిగతా 2 లో

ప్రధాని 'మన్ కీ బాత్' వినలేదని
36 మంది నర్సింగ్ విద్యార్థులకు శిక్ష

వారంరోజులు ఔటింగ్ నిషేధం

చండీగఢ్ పీజీఐఎంఈఆర్‌లో ఘటన

చండీగఢ్: ప్రధాని నరేంద్రమోదీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 100వ ఎపిసోడ్ విననందుకు 36 మంది నర్సింగ్ విద్యార్థులను కాలేజి యాజమాన్యం శిక్షించిన ఘటన చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ (పీజీఐఎంఈఆర్)లో జరిగింది. మహిళా విద్యార్థులను వారం పాటు హాస్టల్ నుంచి బయటకు రానివ్వకుండా నిషేధించింది. ఏప్రిల్ 30న మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ ప్రసారం కాగా విద్యార్థులపై ఇనిస్టిట్యూట్ యాజమాన్యం చర్యలు తీసుకోవడం ఆలశ్యంగా (మే 10న) వెలుగులోకి వచ్చింది. కాలేజి ఆవరణలో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

వివేకా లేఖపై వేలిముద్రల పరీక్ష

సీబీఐ కీలక నిర్ణయం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు రోజుకో మలుపు తిరుగుతోంది. ఇప్పటికే ఈ కేసులో ఒక్కో నిందితుడినీ అరెస్టు చేసి జైలుకు పంపుతున్న సీబీఐ... తాజాగా ఎంపీ అవినాశ్‌రెడ్డి పదేపదే చేస్తున్న ఆరోపణల ఆధారంగా వివేకా హత్య ఘటనలో లభ్యమైన లేఖకు నిన్ హైడ్రేట్(వేలిముద్రలు) పరీక్ష నిర్వహించాలని కీలక నిర్ణయం తీసుకుంది. వివేకా రాసిన లేఖపై ఎవరెవరి వేలిముద్రలున్నాయో గుర్తించేందుకు కసరత్తు మొదలుపెట్టింది. ఈ మేరకు సీబీఐ కోర్టులో అనుమతి కోరుతూ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన సీబీఐ కోర్టు నిందితుల అభిప్రాయం కోరుతూ తదుపరి విచారణను జూన్ 2వ తేదీకి వాయిదా వేసింది. వివేకా హత్య సమయంలో నిందితులు ఆయనతో బలవంతంగా ఓ లేఖ రాయించారని సీబీఐ

- మిగతా 2 లో

ఆర్-5 జోన్ ఉద్రిక్తం

- పొలం చదును పనులు అడ్డుకున్న రైతులు
- పెట్రోలు బాటిళ్లతో మహిళల నిరసన
- పొక్లెయిన్లతో వెనుతిరిగిన అధికారులు
- తుళ్లూరులో అన్నదాతల భారీ ప్రదర్శన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాజధాని పరిధిలోని ఆర్-5 జోన్‌లో ఇతర ప్రాంతాల పేదలకు ఇంటిస్థలాలు ఇచ్చేందుకు సీఆర్‌డీఏ సిబ్బంది చేపట్టిన పొలం చదును పనులను దొండపాడు, నెక్కల్లు గ్రామ రైతులు అడ్డుకున్నారు.

వారం రోజులుగా పోలీసు భద్రతతో అధికారులు 50వేల ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్-5 జోన్, ఆర్-3 జోన్‌లో మొత్తంగా ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన ప్రజలకు సుమారు 50వేల ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన రాళ్లు వేసే కార్యక్రమంలో తలమునకలైంది. రాజధాని ప్రాంతంలో నాలుగేళ్ల క్రితం పేదల కోసం కట్టిన టిడ్కో ఇళ్లను ఇంతవరకు కేటాయించకుండా, ఈ ప్రాంతంలో ఉన్న పేదలను కాదని, ఇతర ప్రాంత పేదలకు ఇక్కడ ఇళ్ల స్థలాలు ఇవ్వడం వెనుక అమరావతి రాజధాని మాస్టర్‌ప్లాన్‌ను చెడగొట్టే కుట్ర ఉందంటూ రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆర్-5 జోన్ ఏర్పాటును గ్రామసభలు వ్యతిరేకిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించినా, ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ ప్రభుత్వం

- మిగతా 2 లో

ఇమ్రాన్ ఖాన్‌కు హైకోర్టులో స్వల్పఊరట

- అల్ ఖదీర్ ట్రస్ట్ కేసులో లభించిన బెయిల్
- తోషాఖానా కేసులో నేర విచారణపై స్టేకు కోర్టు ఆదేశం

ఇస్లామాబాద్: పాకిస్తాన్ తెహ్రీకే ఇస్లాం (పీటీఐ) పార్టీ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్‌కు రెండు కేసుల్లో ఇస్లామాబాద్ హైకోర్టు స్వల్పఊరట కల్పించింది. అల్ ఖదీర్ ట్రస్ట్ కేసులో రెండు వారాల బెయిల్‌ను మంజూరు చేసింది. అటు తోషాఖానా కేసులో క్రిమినల్ ప్రొసీడింగ్స్ (నేర విచారణ వ్యవహారాలు)పై స్టే విధించింది. ఈ కేసులో తదుపరి విచారణను జూన్ 8వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకు స్టే అమల్లో ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. హైకోర్టు ఆవరణలో ఇమ్రాన్ ఖాన్ అరెస్టును పాకిస్తాన్ సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఆయనను విడుదల చేయాలని గురువారం ఆదేశాలిచ్చింది. మే9 తర్వాత నమోదైన కేసుల్లో ఇమ్రాన్‌ను ఈనెల 17 వరకు అరెస్టు చేయకుండా అధికారులకు ఆదేశాలను జారీచేసింది. దీంతో ఆయనకు ఉపశమనం కల్పించింది.

మరో ఇద్దరు పీటీఐ నేతలు అరెస్టు: ఇమ్రాన్ ఖాన్ పార్టీ నేతల అరెస్టులు కొనసాగుతున్నాయి. మరో ఇద్దరు పార్టీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాజీ మంత్రులు షిరీన్ మజారీ, యాస్మీన్ రషీద్‌లను నిర్బంధించినట్లు పీటీఐ వర్గాలు తెలిపాయి. మఫ్టీలో వెళ్లి షిరీన్ ఇంట్లోకి చొరబడి ఆమెను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను షిరీన్ తనయ, న్యాయవాది ఇమాన్ హజీర్-మజారీ ట్విట్టర్‌లో పెట్టారు. మరో వీడియోలో మహిళా అధికారులు మాజీ మంత్రిని పోలీసు వాహనంలో ఎక్కిస్తుండగా ఆమె విక్టరీ సైగ చేయడం కనిపించింది. ఆరోగ్యశాఖ మాజీ మంత్రి డాక్టర్ యాస్మీన్ రషీద్‌ను కూడా పోలీసులు అరెస్టు చేసినట్లు పీటీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే అసద్ ఉమర్, ఫవాద్ చౌధురి, షా మహమూద్ ఖురేషి, అలీ మహమ్మద్ ఖాన్, ఐజాస్ చౌధురి అరెస్టుకు గురయ్యారు.

ఇమ్రాన్‌ను చంపే కుట్ర: పీటీఐ ఆరోపణ

తమ నాయకుడు ఇమ్రాన్ ఖాన్ అరెస్టు వెనుక ఆయన హత్య కుట్ర దాగివున్నదని, ఆయనకు గుండెపోటు వచ్చేలా ఇంజెక్షన్లు, ఆహారాన్ని ఇచ్చారని, టాయిలెట్ వసతి కూడా కల్పించలేదని పీటీఐ వర్గాలు తీవ్ర ఆరోపణలు చేశాయి. శుక్రవారం మధ్యాహ్నం ప్రార్థనల తర్వాత దేశవ్యాప్త ఆందోళనలకు పార్టీ పిలుపుచ్చింది. అనేకచోట్ల శాంతియుతంగా ఆందోళనలు జరిగాయి. పోలీసు దమనకాండ, శాంతిభద్రతలు గాడితప్పడం వల్ల దేశంలో న్యాయం దారుణ హత్యకు గురైందని ఘాటుగా వ్యాఖ్యానించింది. తమ చైర్మన్ ప్రాణాలతో చెలగాటం ఆటనివ్వబోమని, ఆయనను ప్రతికారానికి బలికానివ్వబోమని పీటీఐ తేల్చిచెప్పింది.

నాలుగో రోజూ మొబైల్ ఇంటర్నెట్ బంద్

పాకిస్థాన్‌లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను ఈనెల 9వ తేదీ నుంచి నిలిపివేశారు. నాల్గో రోజైన శుక్రవారం కూడా పునరుద్ధరించలేదు. మొబైల్ ఇంటర్నెట్ సేవల పునరుద్ధరించేలా తమకు ఆదేశాలు రాలేదని పాకిస్తాన్ టెలీకమ్యూనికేషన్ అథారిటీ (పీటీఏ) వెల్లడించింది. ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చే వరకు మొబైల్ ఇంటర్నెట్ సేవల్ని పునరుద్ధరించలేమని తెలిపింది. అయితే బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించింది. కాగా, ఇమ్రాన్ అరెస్టుతో చెలరేగిన హింస కారణంగా లాహోర్, రావల్పిండి, పెషావర్ తదితర నగరాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా సామాజిక మాధ్యమాలను నిషేధించారు.

ఇమ్రాన్‌పై అంత ప్రేమ ఎందుకు?

- దేశంలోని దోపిడీదారులు అందరినీ వదిలేయండి
- నవాజ్ షరీఫ్‌కు జరిగినది అన్యాయం కాదా!
- సుప్రీంకోర్టు తీరుపై ప్రధాని షెహబాజ్ అసహనం

ఇస్లామాబాద్: పీటీఐ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్‌పై న్యాయస్థానాలకు అంత ప్రేమే ఉంటే ఆయన ఒక్కరినే కాదు దేశంలోని అన్ని జైళ్లలో ఉన్న దోపిడీదారులందరినీ విడుదల చేయాలని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇమ్రాన్ విడుదలకు సుప్రీంకోర్టు ఆదేశాలివ్వడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఫెడరల్ కేబినెట్‌నుద్దేశించి మాట్లాడుతూ 'తమకు ఇష్టమైన వ్యక్తికి అనుకూలంగా ఉండాలని అనుకుంటే దేశంలోని జైళ్లలో ఉన్న దోపిడీదారులు అందరినీ విడిచిపెట్టేయండి. ఈ వెసులుబాటు ప్రతి ఒక్కరికీ లభించనివ్వండి. తాజా పరిణామాల పర్యవసానాలకు అందరూ మూల్యం చెల్లించుకోక తప్పదు' అని షెహబాజ్ వ్యాఖ్యానించారు. ఇటువంటి ద్వంద్వ వైఖరి వల్ల పాకిస్తాన్‌లో న్యాయం చచ్చిపోయిందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. గతంలో పీఎంఎల్-ఎన్ అధ్యక్షుడు నవాజ్ షరీఫ్, ఆ పార్టీ సభ్యుల అరెస్టులను గుర్తుచేస్తూ నవాజ్‌కు అన్యాయం జరిగిందని అప్పట్లో ఏ కోర్టు అనలేదన్నారు. ఇమ్రాన్‌ను కోర్టులో ప్రవేశపెట్టినప్పుడు చాలా రోజుల తర్వాత కలుసుకున్నామంటూ సీజేపీ ఆనందంగా పలుకరించారని ఎద్దేవా చేశారు. ఇమ్రాన్ అరెస్టు తర్వాత దేశంలో జరిగిన హింస...1974లో ఢాకా అల్లర్లను తలపించినట్లు షెహబాజ్ తెలిపారు. మాజీ ప్రధాని బెనజీర్ భుట్టో చనిపోయినప్పుడు ఆందోళనలు జరిగినా సైనిక స్థావరాలపై దాడులకు పాల్పడలేదన్నారు. పీటీఐ హయాంలో పీఎంఎల్-ఎన్‌పై రాజకీయ దమనకాండను కోర్టులు ఎన్నడు ప్రశ్నించలేదన్నారు. మమ్మల్ని జైలుకు ఎప్పుడు పంపారన్నదైనా కోర్టులు గమనించాయా? అని ప్రశ్నించారు. ఇమ్రాన్ ఖాన్, ఆయన పార్టీ అవాస్తవాలకు పెట్టింది పేరని గతంలో ఆయన తన ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు అమెరికా కుట్రలు చేస్తున్నట్లు చెప్పడాన్ని, అవి తప్పుడు ఆరోపణలు అని భద్రతా కమిటీలు ధ్రువీకరించడాన్ని షెహబాజ్ గుర్తుచేశారు. పీటీఐ నాయకత్వం దేశాన్ని వినాశనం అంచునకు నెడుతోందని, ఇప్పటికే అనేక సవాళ్ల సుడిగుండంలో చిక్కుకొన్న పాకిస్తాన్‌ను మరింత సంక్షోభంలో కూరుకుపోయేలా చేస్తోందని అన్నారు. ఐఎంఎఫ్‌తో ఒప్పందాన్ని గత ప్రభుత్వం ఉల్లంఘించిందని, దిద్దుబాటు చర్యలకు యత్నిస్తున్నామని ఆయన చెప్పారు. పాకిస్తాన్ అమరులను శత్రువుల కంటే ఘోరంగా పీటీఐ నిరసనకారులు అవమానించారని షెహబాజ్ షరీఫ్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

కుల వివక్ష నిరోధక బిల్లుకు

కాలిఫోర్నియా సెనేట్ ఆమోదం

వాషింగ్టన్: అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో కుల వివక్ష నిరోధక బిల్లుకు ఆమోదం లభించింది. ఎస్‌బీ403 బిల్లును సెనేట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఓటింగ్‌లో 35 మంది సభ్యులు పాల్గొనగా 34 మంది అనుకూలంగా, ఒకరు మాత్రమే వ్యతిరేకంగా ఓటేయడంతో బిల్లుకు ఆమోదం లభించింది. ఈ బిల్లును ప్రతినిధుల సభకు, ఆపై గవర్నర్ ఆమోదముద్ర కోసం పంపనున్నారు. అది లభిస్తే ఎస్‌బీ 403 బిల్లు... చట్టంగా మారుతుంది. ఈ బిల్లును కాలిఫోర్నియా సెనేటర్ ఐషా వాహబ్ ప్రవేశపెట్టారు. కాలిఫోర్నియాలో కొనసాగుతున్న కుల వివక్షను ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు, వసతులు, సేవలు అందాలని, కులవివక్ష-హింసను నిరోధించాలని, బాధితులకు రక్షణ కల్పించాలని అన్నారు. ఇందుకోసమే అవసరమైన విధివిధానాలతో ఎస్‌బీ 403 బిల్లు రూపొందినట్లు తెలిపారు. బిల్లును సెనేట్ ఏకగ్రీవంగా ఆమోదించడంపై హర్షం వ్యక్తంచేశారు. ఇటీవల సీటల్ కూడా కుల వివక్షకు చెక్‌పెట్టే బిల్లును తీసుకొచ్చిన విషయం విదితమే.

కన్నడ ఓట్ల లెక్కింపు నేడే

- భారీ భద్రతా ఏర్పాట్లు
- సర్వం సిద్ధం చేసిన ఈసీ
- ఫలితాలపై బీజేపీ, కాంగ్రెస్ గంపెడాశ

బెంగళూరు: కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శనివారం వెలువడనున్నాయి. ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేసింది. మే 10వ తేదీన జరిగిన ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పోటాపోటీగా తలపడ్డాయి. సర్వే ఫలితాలు, ఎగ్జిట్ పోల్ ఫలితాలు కాంగ్రెస్‌కు మొగ్గుచూపినప్పటికీ బీజేపీ కూడా గెలుపుపై గంపెడాశలు పెట్టుకుంది. ఇక జేడీఎస్ మాత్రం కింగ్ మేకర్ స్థానం కోసం ఆశగా ఎదురుచూస్తోంది. కన్నడ ఫలితాల్లో హంగ్ అసెంబ్లీ ఏర్పడాలని, ప్రభుత్వ ఏర్పాటులో తానే కీలకం కావాలని జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి కోరుకుంటున్నారు. బీజేపీ నేత, ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, కాంగ్రెస్ అగ్రనాయకులు డీకే శివకుమార్, సిద్ధరామయ్య, కుమారస్వామి ఫలితాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఓట్ల లెక్కింపు 36 కేంద్రాల్లో ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. మధ్యాహ్నానికల్లా తుది ఫలితాలు వెలువడవచ్చని ఎన్నికల అధికారులు భావిస్తున్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో అల్లర్లు జరగకుండా నివారించడానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకించి ఓట్ల లెక్కింపు కేంద్రాల లోపల, బయటా భారీ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మొత్తం 224 అసెంబ్లీ నియోజకవర్గాలకు రికార్డుస్థాయిలో 73.19 శాతం పోలింగ్ నమోదైన విషయం విదితమే. కాంగ్రెస్, బీజేపీ మధ్య గట్టి పోటీ జరిగినట్లు అత్యధిక ఎగ్జిట్‌పోల్స్ అంచనా వేయడంతో రెండు పార్టీల నాయకులు ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. హంగ్ అసెంబ్లీ ఏర్పడాలని ఆశిస్తున్న జేడీఎస్...ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషించాలని బలంగా కోరుకుంటున్నది. ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా రావడమా? లేక హంగ్ ఏర్పడటమా అనే అంశంపైనే ఎక్కువగా చర్చ జరుగుతోంది. ప్రధాని మోదీ మ్యాజిక్ పనిచేస్తే తప్ప బీజేపీ గెలుపు సులభం కాదని

విశ్లేషకులు చెబుతున్నారు. కర్నాటకలో వరుసగా రెండుసార్లు ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన చరిత్ర లేదు. కానీ మళ్లీ అధికారం చేపట్టి 38 ఏళ్ల ఈ చరిత్రను తిరగరాయాలని బీజేపీ భావిస్తోంది. ఢిల్లీ, పంజాబ్‌లో అధికారం చేపట్టిన ఆమ్ ఆద్మీ పార్టీ కూడా కర్నాటక ఎన్నికల్లో పోటీ చేసింది. కొన్ని నియోజకవర్గాల్లో చిన్నాచితకా పార్టీలు బరిలో నిలిచాయి.

నిర్బంధం తగదు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-కొల్లిపర/దుగ్గిరాల: పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అడుగుతుంటే నిర్బంధాలకు గురిచేయడం వైసీపీ ప్రభుత్వానికి తగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హితవు పలికారు. ప్రతి రైతును ఆదుకునే వరకు, తడిసిన ప్రతిగింజ కొనే వరకు పోరాటం కొనసాగుతోందని స్పష్టం చేశారు. సీఎం కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన రామకృష్ణను తాడేపల్లిలో పోలీసులు అడ్డుకుని కొల్లిపర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ 15 జిల్లాల్లో అకాల వర్షాలకు పెద్దఎత్తున పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. తడిసిన పసుపు, ధాన్యం, మొక్కజొన్న, జొన్నను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రైతుల వద్దకు వెళ్లి పరామర్శించారని, పంటను పరిశీలించారని, కానీ ముఖ్యమంత్రి జగన్‌కు మాత్రం రైతును ఓదార్చే సమయం లేకుండా పోయిందని విమర్శించారు. ముఖ్యమంత్రికి రైతులు కూడా ఓట్లు వేశారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు సీఎం వద్దకు వెళ్లి వినతిపత్రం ఇచ్చి రైతు సమస్యలపై మాట్లాడతామని తెలిపారు. సీపీఐ మంగళగిరి నాయకులు కంచర్ల కాశయ్య, కొల్లిపర మండల కార్యదర్శి తుంగా బాలస్వామి, కొల్లిపర సీపీఎం కార్యదర్శి కోట చంద్రశేఖర్, ఎస్టీయూ నాయకులు కనపర్తి బెన్‌హర్‌బాబు, టీడీపీ నాయకులు కంచర్ల అమృతరాజు, ఆరే శేఖరరావు, సీపీఐ నాయకులు కోటయ్య, సురేశ్, రాజు తదితరులు రామకృష్ణను పరామర్శించారు. అనంతరం దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రైతు సంఘం, సీపీఐ నాయకులను రామకృష్ణ పరామర్శించారు.

ఆదుకోమంటే అరెస్టులా?

(మొదటిపేజీ తరువాయి)

మద్దతు ధరతో కొనుగోలు చేసే పరిస్థితి ఈ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. పంటను కాపాడుకోవడానికి పరదాలు కూడా సరఫరా చేయడం లేదని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి మీనమేషాలు లెక్కిస్తున్నదని దుయ్యబట్టారు. ప్రకృతి విపత్తుల నిర్వహణ కోసం రూ.2 వేల కోట్లు కేటాయించినప్పటికీ వాటిని వినియోగించడం లేదన్నారు. ఏ పంటకు కనీస మద్దతు ధర లేదని, పంటల బీమా పథకం అమలు జరగడం లేదని ఆగ్రహం వెలిబుచ్చారు. ధరల స్థిరీకరణ కోసం రూ.3 వేల కోట్లు కేటాయించామని చెబుతున్న ప్రభుత్వం...ఆ నిధిని ఉపయోగించి పంటలను ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బేషజాలకు పోకుండా ఆహార పంటలకు ఎకరాకు రూ.40 వేలు, వాణిజ్య పంటలకు రూ.75 వేలు ఇవ్వాలని, ఉద్యానవన పంటలకు ఎకరాకు లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ముఖ్యమంత్రి ఇప్పటి వరకు ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. రైతు పండించిన పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయడం ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదని మండిపడ్డారు. రైతుల దయనీయ పరిస్థితులను వినే తీరిక...ఓపిక ముఖ్యమంత్రికి లేకపోవడం బాధాకరమన్నారు. కనీసం వినతిపత్రం ఇవ్వడానికి కూడా అనుమతివ్వడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతుసంఘం ప్రతినిధులు, సీపీఐ శ్రేణులను గృహనిర్బంధం, అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వం రైతులకు ఏమి సందేశం ఇవ్వాలనుకుంటుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రిగా రైతులకు ఇచ్చిన భరోసా ఏమిటని జగన్‌మోహన్ రెడ్డిని నిలదీశారు. రైతు భరోసా కేంద్రాలు రైతు భక్షక కేంద్రాలుగా మారాయన్నారు. మీటనొక్కుడుకు పరిమితమైన జగన్‌మోహన్ రెడ్డి రైతును ఆదుకునే దిశగా చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ఒక్క మిర్చి పంటకు తప్ప ఏ పంటకు గిట్టుబాటు ధర లేదని తెలిపారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి సీఎం జగన్ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే అన్ని ప్రతిపక్షాలను కలుపుకుని ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

జీఓ 1ని కొట్టివేయడం శుభపరిణామం

ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 1ని కొట్టివేస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వడం శుభపరిణామమని ముప్పాళ్ల అన్నారు. కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు.

జీఓ ఒకటిని సవాల్ చేస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిటిషన్ వేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అరెస్టు అయిన వారిలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్, మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నాయకులు కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, జమలయ్య, కాకోతు ఈశ్వరరావు, జాలాది జాన్‌బాబు, ఉలవలపూడి రాము, కోట మాల్యాద్రి, ముసునూరు సుహాస్, అన్నవరపు ప్రభాకర్, జవ్వాది సాంబశివరావు, పంతగాని మరియదాసు, జవహర్ జానీ, బాణాల రామయ్య, ఎస్‌కే కరీముల్లా, శశి, వెంకటేశ్వర్లు, గుంటక సాంబిరెడ్డి, పుప్పాల సత్యనారాయణ, బోర్లా శీను, ముప్పాళ్ల శివశంకరరావు, రామారావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కే సుభానీ, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల నాజర్ జీ, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణం, ఏఐవైఎఫ్ గుంటూరు నగర కార్యదర్శి చల్లా మరియదాసు, ఏఐవైఎఫ్ నాయకులు బి.గోపి, ఎస్‌కే కరిముల్లా, మల్లికార్జునరావు, ఆర్.వందనం, ఉమామహేశ్వరరావు, ముక్కాముల, కాట్రగడ్డ రామచంద్ర జోషి, శనగల సుబ్బారెడ్డి, ఎర్రగుంట నాగరాజు, రత్తయ్య గోగినేని, గుత్తికొండ రామారావు, బోస్, తాడిబోయిన శివన్నారాయణ, షేక్ జాన్‌సైదా తదితరులు ఉన్నారు.

రాహుల్‌ని దోషిగా తేల్చిన

జడ్జికి పదోన్నతి నిలిపివేత

మరో 67 మంది పదోన్నతిపైనా సుప్రీం స్టే

న్యూఢిల్లీ : పరువు నష్టం కేసులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని దోషిగా తేల్చిన సూరత్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ హరీష్ హస్ముఖ్ భాయ్ వర్మ సహా 68 మంది గుజరాత్ దిగువ న్యాయాధికారుల పదోన్నతిపై సుప్రీం కోర్టు శుక్రవారం స్టే విధించింది. జ్యుడీషియల్ అధికారుల పదోన్నతి గుజరాత్ రాష్ట్ర న్యాయ న్యాయ సేవ నిబంధనలు-2005ని ఉల్లంఘించిందని న్యాయమూర్తులు ఎం.ఆర్.షా, సి.టి.రవికుమార్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఇది మెరిట్-కమ్-సీనియారిటీ సూత్రం, అనుకూలత పరీక్షలో ఉత్తీర్ణత సాధించడంపై తప్పనిసరిగా పదోన్నతులు కల్పించాలని పేర్కొంది. 'జిల్లా జడ్జిలకు పదోన్నతులు కల్పిస్తూ హైకోర్టు జారీ చేసిన అభ్యంతరాల జాబితా, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు చట్టవిరుద్ధమని, ఈ కోర్టు నిర్ణయానికి విరుద్ధంగా ఉన్నాయని మేము సంతృప్తి చెందాము. అందువల్ల అదే స్థిరమైనది కాదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'మేము పదోన్నతి జాబితా అమలును నిలిపివేస్తాము. సంబంధిత పదోన్నతులు వారి పదోన్నతికి ముందు వారు కలిగి ఉన్న వారి అసలు పదవికి పంపబడతారు' అని తెలిపింది. పదోన్నతులపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన అత్యున్నత న్యాయస్థానం, మే 15న జస్టిస్ షా పదవీ విరమణ చేయనున్నందున ఈ అంశాన్ని తగిన ధర్మాసనం విచారించాలని ఆదేశించింది. 68 మంది న్యాయాధికారులను జిల్లా జడ్జిల ఉన్నత స్థాయికి ఎంపిక చేయడాన్ని సవాల్ చేస్తూ సీనియర్ సివిల్ జడ్జి కేడర్ అధికారులు రవికుమార్ మెహతా, సచిన్ ప్రతాప్ రాయ్ మెహతా దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. సూరత్ సీజేఐ అయిన వర్మ, జిల్లా దిగువ న్యాయవ్యవస్థలోని 68 మంది అధికారులలో ఒకరు. వీరి పదోన్నతిని కూడా మెహతా సవాలు చేశారు.

మెహతా ప్రస్తుతం గుజరాత్ ప్రభుత్వం న్యాయ విభాగంలో అండర్ సెక్రటరీగా, రాష్ట్ర న్యాయ సేవల్లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఇద్దరు న్యాయాధికారుల పిటిషన్‌పై ఏప్రిల్ 13న రాష్ట్ర ప్రభుత్వానికి, గుజరాత్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు నోటీసులు జారీ చేసిన అత్యున్నత న్యాయస్థానం... 68 మందికి పదోన్నతి కల్పిస్తూ ఏప్రిల్ 18న జారీ చేసిన నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శించింది. 'ప్రతివాదులు, ముఖ్యంగా, రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రక్రియల గురించి తెలిసినప్పటికీ, ప్రస్తుత విచారణలో ఈ కోర్టు నోటీసును ఏప్రిల్ 28, 2023న తిరిగి ఇచ్చేలా చేయడం చాలా దురదృష్టకరం. ఏప్రిల్ 18, 2023 పదోన్నత ఉత్తర్వును జారీ చేసింది. అంటే ప్రస్తుత విచారణలో ఈ కోర్టు జారీ చేసిన నోటీసు అందిన తర్వాత, ఏప్రిల్ 28న తన ఆర్డర్‌లో సుప్రీం కోర్టు పేర్కొంది.

పదోన్నతి ఆర్డర్‌లో, రాష్ట్ర ప్రభుత్వం కూడా సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న ప్రక్రియల ఫలితాలకు లోబడి ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. దీనికి ముందు, ఇద్దరు జ్యుడీషియల్ అధికారుల పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఏప్రిల్ 13న నోటీసులు జారీ చేసింది. నియామక నిబంధనల ప్రకారం, మెరిట్-కమ్-సీనియారిటీ సూత్రం ఆధారంగా 65 శాతం రిజర్వేషన్లు ఉంచి, అనుకూలత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి జిల్లా జడ్జి పోస్టును భర్తీ చేయాలని పిటిషన్‌లో పేర్కొంది. కాగా ఇద్దరు న్యాయాధికారులు 200 మార్కులకు గాను 135.5 మార్కులు, 148.5 మార్కులు సాధించారు. అయినప్పటికీ, తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థులను జిల్లా జడ్జిలుగా నియమించారు.

36 మంది నర్సింగ్ విద్యార్థులకు శిక్ష

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన ప్రసారానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనిని పీజీఐఎంఈఆర్ నిరాకరించలేదు. మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఎనిమిది మంది మొదటి సంవత్సరం, 28 మంది మంది తృతీయ సంవత్సరం చదివే నర్సింగ్ విద్యార్థులు డుమ్మా కొట్టారు. దీంతో వారిపై హాస్టల్ వార్డెన్ ఫిర్యాదు మేరకు 'ఔటింగ్' లేకుండా శిక్షించారు. అయితే ఈ మేరకు చర్యలు ఉంటాయని విద్యార్థులను ముందే హెచ్చరించినట్లు వార్డెన్ చెప్పారు. ఏప్రిల్ 29వ తేదీ రాత్రి, 30వ తేదీ ఉదయం కూడా తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పినప్పటికీ 36 మంది గైర్హాజరయ్యారన్నారు. దీంతో డుమ్మా కొట్టిన విద్యార్థులకు శిక్షగా వారం పాటు బయటకు వెళ్లకుండా నిషేధిస్తూ ఈనెల 3న కాలేజి ఇంచార్జి ఉత్తర్వులిచ్చారు.

నర్సింగ్ విద్యార్థి సంఘాల ఖండన

ఒక రాజకీయ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావలని ఆదేశాలివ్వడమే కాకుండా గైర్హాజరు అయినందుకు విద్యార్థులను శిక్షించడం ఆక్షేపణీయమని నర్సింగ్ విద్యార్థి సంఘాలు పేర్కొన్నాయి. ఇదే క్రమంలో పీజీఐ నర్సుల సంక్షేమ సమాఖ్య అధ్యక్షులు మంజీనీక్ మాట్లాడుతూ ఇలా శిక్షలు విధించడం విద్యార్థుల స్వేచ్ఛాహక్కును అతిక్రమించడమే అని అన్నారు. మన్ కీ బాత్ కార్యక్రమమేమీ అకడమిక్ లెక్చర్ లేక సెమినార్ కాదని, దీనికి విద్యార్థులంతా హాజరు కావాల్సిన అవసరం లేదని అన్నారు. ఒకవేళ్ల ముఖ్యమైన సెమినార్లు, లెక్చర్లకు డుమ్మా కొట్టినా శిక్షించే పద్ధతి లేదన్నారు. మన్ కీ బాత్ ఓ రాజకీయ కార్యక్రమమని, తప్పనిసరిగా హాజరు కావాల్సిందేనని ఇనిస్టిట్యూట్ ఆదేశాలివ్వడం తప్పు అని, హాజరుకాలేదన్న నెపంతో విద్యార్థులను శిక్షించడం ఇంకా పెద్దతప్పు అని అన్నారు.

వీరు పాలకులకు తొత్తులా!

కాలేజి యాజమాన్యాలు పాలకులకు తొత్తులా అంటూ ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ అపూర్వనంద్ అసహనం వ్యక్తంచేశారు. 'కొన్ని యాజమాన్యాలు సిగ్గులేకుండా పాలకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నాయి' అని ట్వీట్ చేశారు. దీనిని ఇలానే వదిలేయడం మంచిది కాదని సూచించారు.

క్రమశిక్షణ నేర్పుందుకే...

తమ ఇనిస్టిట్యూట్‌లో క్రమశిక్షణ పాటించడానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని పీజీఐఎంఈఆర్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ డాక్టర్ సుఖ్‌పాల్ కౌర్ అన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పేందుకు అప్పుడప్పుడు ఇటువంటి చర్యలు తప్పవని అన్నారు. మన్ కీ బాత్‌కు హాజరు కావాలని చెప్పినప్పుడు వారు హాజరు కావాల్సిందేనని, డుమ్మా కొట్టడం సరైన పద్ధతి కాదన్నారు. ఇది చిన్న విషయమని, అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని పీజీఐఎంఈఆర్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. అధికారిక కార్యక్రమాలకు డుమ్మా కొట్టిన విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం కొత్తేమీ కాదని, ప్రధానిదీ అధికారిక కార్యక్రమేనన్నారు.

తప్పు ఒప్పుకున్న యాజమాన్యం

'ఈ విషయంలో కాలేజి యాజమాన్యం కాస్త అతిగానే వ్యవహరించిందని ఒప్పుకుంటున్నామని పీజీఐఎంఈఆర్ యంత్రాంగం పేర్కొంది. సంబంధిత అధికారులను వారించినట్లు అధికారిక ప్రకటనలో తెలిపింది. ఈ అంశాన్ని వివాదాస్పదం చేయొద్దని కోరింది. తమ ఇనిస్టిట్యూట్‌లలో గెస్ట్ లెక్చర్లు, చర్చలు జరుగుతుంటాయని, నిపుణులైన వక్తలు పాల్గొంటారని, ఇందులో భాగంగానే మన్ కీ బాత్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. అంతకుముందు ఎపిసోడ్‌లో పీజీఐఎంఈఆర్ ద్వారా అవయవదానం చేసిన వ్యక్తి కుటుంబంతో మోదీ మాట్లాడారని, అవయవదానాన్ని ప్రోత్సహించారని తెలిపింది. ఇటువంటివి వింటే విద్యార్థులకు మంచిదని భావించే మన్ కీ బాత్ ప్రసారం చేసినట్లు పేర్కొంది. ఈ అంశాన్ని పెద్దది చేయొద్దని కోరుతున్నట్లు ప్రకటనలో పేర్కొంది.

నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు

(మొదటిపేజీ తరువాయి)

జారీ చేసింది. ఆ నోటీసులకు తెలంగాణ, కేంద్ర ప్రభుత్వాలు స్పందించలేదు. దీంతో మరో 4 వారాలు సుప్రీం గడువు ఇచ్చింది. ఉమ్మడి రాష్ట్రాలకు చెందిన దాదాపు రూ.1,42,601 కోట్ల విలువైన ఆస్తులను విభజించకుండా తెలంగాణ కాలయాపన చేస్తోందని ఏపీ ఆరోపిస్తోంది. విభజన జరగాల్సిన 91 శాతం ఆస్తులు హైదరాబాద్‌లోనే ఉన్నాయని ఏపీ తెలిపింది. 8 ఏళ్లయినా ఆస్తుల విభజనకు తెలంగాణ సహకరించడం లేదని ఏపీ వెల్లడించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 ప్రకారం ఏపీ ప్రజల హక్కులకు తెలంగాణ భంగం కలిగించిందంటూ పిటిషన్‌లో ఏపీ పేర్కొంది. ఆస్తుల విభజన త్వరగా జరిగేలా ఆదేశాలివ్వాలని కోరింది. ఈ నేపథ్యంలో కేంద్రానికి, తెలంగాణ ప్రభుత్వాలకు కౌంటర్ దాఖలుకు తుది గడువు విధించింది. అలాగే ఆస్తుల విభజనకు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయాలన్న ఏపీ అభ్యర్థనను పరిశీలిస్తామని సుప్రీం కోర్టు తెలిపింది.

వివేకా లేఖపై వేలిముద్రల పరీక్ష

(మొదటిపేజీ తరువాయి)

వాదిస్తోంది. ఘటనా స్థలిలో లభించిన ఈ లేఖలో... ఆలస్యంగా వచ్చావని ప్రశ్నించినందుకు డ్రైవర్ ప్రసాద్ దారుణంగా కొట్టి చంపేస్తున్నాడని వివేకా ఆరోపించినట్లు సీబీఐ రిమాండ్ రిపోర్టుల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలో వివేకా రాశారని చెబుతున్న లేఖ కీలకంగా మారింది. ఈ లేఖను 2022 ఫిబ్రవరిలోనే సీబీఐ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి రెండు ప్రధాన అంశాలను తెలియజేయాలని కోరారు. లేఖలో వివేకా ఒత్తిడిలో రాశారా? లేదా ? తేల్చాలని కోరగా, వివేకా రాసిన ఇతర లేఖలను పోల్చిచూసిన తర్వాత ఆయన ఒత్తిడిలోనే ఈ లేఖ రాసినట్లు ఫోరెన్సిక్ నివేదిక తేల్చింది. తాజాగా ఈ లేఖపై వేలిముద్రలు కూడా గుర్తించాలని సీబీఐ నిర్ణయించింది. ఇటీవల ఎంపీ అవినాశ్‌రెడ్డి ఆ లేఖను సీబీఐ ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదని సీబీఐ అధికారులను నిలదీస్తున్నారు. దస్తగిరి చెప్పిన వాంగ్మూలం ఆధారంగానే ఏకపక్షంగా దర్యాప్తు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో సీబీఐ ఈ లేఖపై వేలిముద్రల్ని గుర్తించేందుకు నిన్‌హైడ్రేట్ పరీక్ష చేయించాలని నిర్ణయించింది.

ఆర్-5జోన్ ఉద్రిక్తం

(మొదటిపేజీ తరువాయి)

నియంతృత్వంగా వ్యవహరిస్తున్నదని అమరావతి ఐక్యకార్యాచరణ సమితి నేతలు మండిపడుతున్నారు. రైతులు ప్రతిరోజూ ఆందోళన చేస్తున్నా పట్టించుకోని సీఆర్‌డీఏ సిబ్బంది శుక్రవారం జేసీబీ, పొక్లయినర్లతో పనులు చేయటానికి దొండపాడు వచ్చారు. రైతులు పెద్దసంఖ్యలో అక్కడకు చేరుకుని పనులను అడ్డుకున్నారు. అధికారుల తీరును నిరసిస్తూ పెట్రోల్ బాటిళ్లు పట్టుకుని వాహనాలు వెనక్కి తీసుకెళ్లాలని డిమాండ్ చేస్తూ మహిళా రైతులు నిరసన చేపట్టారు. పెట్రోల్ బాటిళ్లను లాక్కునేందుకు పోలీసుల యత్నించారు. పోలీసులు, రైతుల మధ్య జరిగిన పెనుగులాటతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడగా, చేసేదిలేక సీఆర్‌డీఏ అధికారులు వెనుతిరిగారు.

ఆర్-5జోన్‌ను వ్యతిరేకిస్తూ రైతుల భారీ ర్యాలీ

అమరావతి రాజధాని మాస్టర్‌ప్లాన్‌ను విచ్ఛిన్నం చేసే కుట్రతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్-5 జోన్‌ను వ్యతిరేకిస్తూ తుళ్లూరులో రైతులు భారీ ర్యాలీ నిర్వహించారు. దీక్షా శిబిరం నుంచి సీఆర్‌డీఏ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లారు. 'సెంటు భూమి వద్దు, టిడ్కో ఇళ్లు ముద్దు'...'అమరావతి రెండు జిల్లాలది కాదు... 5 కోట్ల ఆంధ్రులది' అనే ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. సీఆర్‌డీఏ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించగా, పోలీసులు గేట్లు వేసి అడ్డుకున్నారు. అయినప్పటికీ రైతులు నెట్టుకుంటూ లోపలకు వెళ్లి కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఆర్-5జోన్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం మొండిగా ముందుకెళితే తీవ్రంగా ప్రతిఘటిస్తామని రైతులు హెచ్చరించారు.

భారతదేశం ప్రపంచానికి ఆహార భాండాగారం

వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ స్నాతకోత్సవంలో ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్



విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం రూరల్: భారతదేశం ప్రపంచానికి ఆహార భాండాగారంగా ఉందని ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ అభివర్ణించారు. శుక్రవారం ఏలూరు జిల్లా తాడేపల్లిగూడెం మండలం వెంకట రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవ జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యానవన రంగంలో డిగ్రీలు సాధించిన ప్రతి విద్యార్థి మానవతా విలువలను పాటిస్తూ భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు చేసి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. ఆర్థిక సూపర్ పవర్‌గా భారతదేశం ఎదుగుతోందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు ఔషధ మొక్కలు పెంచే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న జనాభాకు అనుగుణంగా వారి మనుగడను కొనసాగించడానికి వ్యవసాయం, ఉద్యానవన పంటలు ఎన్నో సవాళ్లు విసురుతున్నాయన్నారు. భవిష్యత్‌లో పోషకాహార భద్రత మరింత ఎక్కువ ప్రాముఖ్యతను సంతరించుకోనుందని చెప్పారు. ఉద్యానవన ఉత్పత్తి ఇప్పటికే దేశంలోని వ్యవసాయోత్పత్తిని అధిగమించిందని, ఇది స్థూల జాతీయోత్పత్తిలో 6 శాతంగా ఉండడం శుభపరిణామమని అన్నారు. ఉద్యానవన రంగం 14 శాతం ఉపాధి అవకాశాలను సృష్టిస్తోందని, అందులో 42 శాతం మహిళలే కావడం గొప్ప విషయమన్నారు. ఆహారం, పోషకాహార భద్రత సవాళ్లు మన జాతీయ భద్రతలో అంతర్భాగంగా ఇమిడి ఉన్నాయన్నారు. ఎన్నో తరాలుగా మన దేశం జాతీయ ఆహార భాండాగారాన్ని ఆచరణాత్మక మార్గంలో సమృద్ధిగా నిర్వహించిందని, ఇది రుతుపవనాల మార్పులపై ఆధారపడకుండా ప్రత్యేకత కలిగి ఉందని గవర్నర్ అన్నారు. రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించే విధంగా వ్యవసాయ ఉద్యాన అధికారులు ప్రోత్సహించాలన్నారు. ఈ రంగం 17.84 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో 312.34 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో దేశంలోనే రెండో స్థానంలో ఉందని తెలిపారు. ఉద్యానవన ఉత్పత్తిలో ఇన్‌పుట్ వినియోగ సామర్థ్యాన్ని పెంచడానికి రోబోటెక్ టెక్నాలజీలు, డ్రోన్‌ల రూపకల్పన, ఉపయోగం వంటి సరిహద్దు సాంకేతికతలతో విశ్వవిద్యాలయం కూడా ముందుకు సాగడం హర్షనీయం అన్నారు. ప్రతిభ కనబరిచిన శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, విద్యార్థులకు అవార్డులు, బంగారు పతకాలను గవర్నర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నీతి అయోగ్ సభ్యుడు, ప్రఖ్యాత వ్యవసాయ ఆర్థిక వేత్త ప్రొఫెసర్ డా.రమేష్ చంద్ తొలుత స్నాతకోపన్యాసం చేశారు. రమేష్ చంద్ మాట్లాడుతూ ఉద్యానవన విద్యలో ఉత్తమ ఫలితాలు పొంది డిగ్రీలు సాధించిన విద్యార్థులు జాతీయ స్థాయిలో రైతులకు ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న విద్యా వనరులను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్య అవకాశాలు సాధించాలన్నారు. అన్ని రకాల వాతావరణాలకి తట్టుకునే విధంగా రైతులకు ఉపయోగపడే మేలైన వ్యవసాయ, ఉద్యాన వంగడాలను సృష్టించేందుకు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన విత్తనాలతో పాటు నాణ్యమైన ఉత్పత్తులు పొందేందుకు కావలసిన సేంద్రీయ ఎరువులను వాడేవిధంగా రైతులను ప్రోత్సహించాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందే విధంగా రైతులకు కావలసిన సూచనలు, సలహాలు అందించాలన్నారు. మారుతున్న వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు ఉద్యానవన పంటలు వేసుకునే విధంగా ప్రోత్సహించా లన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ, ఉద్యాన పంటల అభివృద్ధికి రైతులకు కావలసిన సాంకేతిక పరిజ్ఞా నాన్ని అందిస్తుందని తెలిపారు. అధిక దిగుబడుల పేరుతో క్రిమిసంహారక మందులు వాడటం వల్ల వాతావరణంలో పెనుమార్పులు కలుగుతున్నాయన్నారు. దీనిని పరిరక్షించేందుకు విద్యార్థి స్థాయి నుంచే రైతులకు సేంద్రీయ, వ్యవసాయ విధానంపై అవగాహన కల్పించాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులను ప్రోత్సహించి వారికి కావలసిన మౌలిక వసతులు కల్పించాలని, ఉద్యాన పంటలలో భాగంగా ఆయిల్ ఫామ్, బొప్పాయి, నిమ్మ, కొబ్బరి, టమాటా, చిల్లీ, కోకో తదితర పంటల్లో ముందంజలో ఉదన్నారు. అలాగే మ్యాంగో, స్వీట్ ఆరెంజ్, ఔషధ మొక్కలు లాంటి ఉద్యానవన పంటలు పండించడంలో ద్వితీయ స్థానంలో ఉదన్నారు. రాష్ట్రంలో 53 శాతం ఉద్యానవన పంటల నుంచి అన్నిరకాల పంటలను విశ్వవిద్యాలయం ద్వారా అంది స్తుందన్నారు. డిగ్రీలు పొందిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ తోలేటి జానకిరామ్... రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు మొమెంటోను అందజేసి సత్కరించారు. ముందుగా విశ్వవిద్యాలయానికి చేరుకున్న గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, విశ్వవిద్యాలయ బోర్డు సభ్యులు, విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్ల ఆందోళనకు మద్దతుగా

16,17 తేదీల్లో రౌండుటేబుల్ సమావేశాలు: ఓబులేసు

విశాలాంధ్ర-విజయవాడ: లైంగిక వేధింపులకు నిరస నగా ఢిల్లీలో రెజ్లర్లు సాగిస్తున్న ఆందోళనకు మద్దతుగా ఈ నెల 16, 17 తేదీలలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించ నున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు తెలిపారు. భారతదేశ కీర్తి పతాకాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ పైన తక్షణం కేసు నమోదు చేసి జైలుకు పంపాలని ఆయన డిమాండ్ చేశారు. విజయవాడ గొల్లపూడిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఏఐటీయూసీ ముఖ్య నాయకుల సమావేశంలో ఓబులేసు మాట్లాడుతూ మహిళా మల్ల యోధులు అయిన జాతీయ క్రీడాకారులపై లైంగిక వేధింపులు జరగడం దారుణం అన్నారు. మహిళా క్రీడాకారులకు రక్షణ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. రెజ్లర్ల సమస్యపై సుప్రీంకోర్టు కలగజేసుకొని నిందితులపై చర్య తీసుకోవాలని చెప్పినా ఇంతవరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం శాఖ మంత్రి అమిత్ షా నోరు మెదపకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. బ్రిజ్ భూషణ్‌ను వెంటనే ఎంపీ పదవి నుండి తొలగించాలని ఓబులేసు డిమాండ్ చేశారు. ఈ సమస్యపై దిల్లీలో జంతర్ మంతర్ వద్ద అగ్రశ్రేణి రెజ్లర్లు గత 20 రోజుల నుంచి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరం అన్నారు. ఈ సమస్యపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మే 16,17 తేదీల్లో రాష్ట్రంలో అన్ని నియోజకవర్గ కేంద్రంలో క్రీడాకారులను ఆహ్వానించి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని, ఈ రౌండ్ టేబుల్ సమావేశాలకు మేధావులను,న్యాయ నిపుణులను కూడా ఆహ్వానిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో చలసాని వెంక ట రామారావు, రావులపల్లి రవీంద్రనాథ్, ఎస్ వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే హక్కుల సాధన

కరవది సుబ్బారావు స్పష్టీకరణ

విశాలాంధ్ర-ఒంగోలు: బడుగు, బలహీన వర్గాల ఐక్యతతోనే హక్కులు సాధించుకోగలమని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు అన్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గం డీహెచ్‌పీఎస్ ప్రథమ మహాసభ శుక్రవారం జరిగింది. పొదిలి మండల కన్వీనర్ గొంగటి ఏసురత్నం అధ్యక్షత వహించారు. కరవది సుబ్బారావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకే బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్ సౌకర్యం కల్పించారన్నారు. వాటిని వినియోగించుకొని ఎస్సీలు, ఎస్టీలు ఎదగాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. మనువాదాన్ని దేశంపై రుద్ది బడుగు, బలహీన వర్గాలను మరింత బానిసలుగా మార్చేందుకు కుట్ర చేస్తోందని ఆగ్రహం వెలిబుచ్చారు. దేశంలోనే కాకుండా రాష్ట్రంలోనూ బహుజనులపై దాడులు, హత్యలు, హత్యాయత్నాలు పెరిగాయన్నారు. మహిళలపై అత్యాచారాలకు అంతే లేదన్నారు. పాలకులు నిందితులకు రక్షణ కవచంలా ఉన్నారని ఆరోపించారు. సబ్‌ప్లాన్ నిధులు ఆయా ప్రాంతాల అభివృద్ధికే వినియోగించాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

చలసాని రామారావు డిమాండ్

విశాలాంధ్ర- విజయవాడ: పనిచేయించుకొని వేతనాలు ఇవ్వకపోతే ఎలాగని, పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. విజయవాడ గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాల యంలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఆయాలు, స్వీపర్ల యూనియన్ రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి రామారావు మాట్లాడుతూ ఆయాలకు ప్రభుత్వ అకౌంట్ నుంచి జీతాలు ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రూ.26000 జీతము ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో దాదాపు 45 వేల మందికి పైగా స్వీపర్లు పని చేస్తున్నారనీ, వీరికి నెలకు 6000 రూపాయలు వేతనం ఇస్తున్నారని తెలిపారు. ఈ అరకొర వేతనం కూడా సరైన కాలంలో చెల్లించడం లేదనీ, దాదాపు మూడు నెలల నుంచి పెండింగ్ వేతనాలు ఇవ్వాల్సి ఉందన్నారు. సంఘం గౌరవాధ్యక్షులు వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ 2018 నుంచి 2020 వరకు 36 నెలల పాటు వేతనాలు పెండింగ్‌లో ఉంటే ఒకసారి ఆందోళన చేసిన తరువాత 18 నెలల బకాయిలు ఇచ్చారని చెప్పారు. ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న మిగిలిన 18 నెలల వేతనాలను కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. సర్వశిక్షా అభియాన్, మధ్యాహ్న భోజన విభాగాల మధ్య సమన్వయం లేకపోవటంతో వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ పెండింగ్ వేతనాలు అందక కార్మికుల పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు. చాలా నెలలు పెండింగ్‌లో ఉండటం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కొన్ని గ్రామాల్లో కొత్తగా వచ్చిన పాఠశాల చైర్మన్లు ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్న కార్మికులను కాదని తమ వాళ్లే పని చేయాలని కార్మికులను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. హైస్కూల్లో పనిచేసే ఆయాలకు పని భారం ఎక్కువైందనీ, వంద మందికి పైగా ఉన్న హైస్కూల్లో మరొక ఆయాను ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయకపోతే ఏపీ ప్రభుత్వపాఠశాల స్వీపర్స్ అండ్ ఆయాల యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగాఆందోళన చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. శివబాలకృష్ణ, అధ్యక్షురాలు జయకుమారి, రాష్ట్ర నాయకులు చాట్ల పుల్లారావు, మర్సకట్ల త్యాగరాజు, కంకిపాటి బుచ్చిబాబు, మట్ట కుమారి, మపర్తి దుర్గ, నీలం జ్యోతి, బడుగు దేవమాత, నక్క అంజమ్మ, గార్లపాటి ధనలక్ష్మి. బి. శారదా, టీ. మంజుల, కె. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలకు సిద్ధమా?

బీజేపీకి ఈశ్వరయ్య సూటి ప్రశ్న

విశాలాంధ్ర-యర్రగుంట్ల: ఈవీఎంలు లేకుండా బ్యాలెట్ పత్రాల ద్వారా ఎన్నికలకు సిద్ధమా అని బీజేపీని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య ప్రశ్నించారు. వైఎస్ఆర్ జిల్లా యర్రగుంట్ల పార్టీ కార్యాల యంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ అన్ని రకాల అడ్డదారులను తొక్కుతోందని ఈశ్వరయ్య విమర్శించారు. ఈవీఎంలు, కులం, మతం, భాష వంటి అన్నింటినీ నిస్సిగ్గుగా వాడుకుంటోందన్నారు. కర్నాటకలో మళ్లీ అధికారం కోసం ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేసిందని, మతాన్ని ఎన్నికల్లో విచ్చలవిడిగా వాడుకుందని ఆయన గుర్తుచేశారు. అయినప్పటికీ కన్నడనాట బీజేపీ ఓటమి ఖాయంగా కనిపిస్తోందన్నారు. సీబీఐ, ఈడీ వ్యవస్థలను తమ గుప్పిట్లో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారం వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడం దారుణమన్నారు. మోదీ అధికారం చేపట్టిన తర్వాత తమకు సాను కూలంగా తీర్పులిస్తున్న న్యాయమూర్తులకు ఏదోఒక మేలు చేయడం సంప్రదాయంగా మారిందన్నారు. ప్రజలు వీటిని గమనించి బీజేపీని దేశం నుండి బహిష్కరించాలని ఆయన పిలుపునిచ్చారు. సమా వేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, నియోజకవర్గ కార్యదర్శి ఎంవీ సుబ్బారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సురేశ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు పాల్గొన్నారు.

పెళ్లి భోజనం వికటించి 300 మందికి అస్వస్థత

విశాలాంధ్ర-పూసపాటిరేగ : వధూవరులు ఒకటయ్యే వేళ గ్రామ ప్రజలంతా ఆనందంగా ఆరగించిన విందు 300 మందిని అస్వస్థలకు గురిచేసింది. భోజనం చేస్తుండగానే ఒకరి తర్వాత ఒకరు వాంతులు చేసుకోవడం కలకలం రేపింది. విజయనగరం జిల్లా పూపాటిరేగ మండలంలోని కొవ్వాడ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. చందక ప్రసాద్ పెళ్లి భోజనం వికటించి చిన్నారులు, వృద్ధులతో సహా దాదాపు ఊర్లో సగానికి పైగా జనం అస్వస్థతకు గురయ్యారు. వారందరినీ 108 వాహనాల్లో పూసపాటిరేగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వసతి సరిపోక సుందర పేట సీహెచ్‌సీకి, విజయనగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తలించారు. విషయం తెలుసుకున్న వైద్య సిబ్బంది గ్రామానికి చేరుకొని వైద్యం అందించారు. మండల నాయ కులు స్థానికులను పరామర్శించారు. పోలీసులు విచారణ చేపట్టారు. తాగునీటి వల్లే ఇలా జరిగిందని ప్రాథమికంగా గుర్తించారు. పారిశుద్ధ్యంలో ఈ గ్రామం వెనకబడి ఉండటం వల్లే ఇలాంటి పరిస్థితి తలెత్తి ఉండవచ్చని కొందరన్నారు.

అవినీతి అధికారులపై ఏసీబీ దాడులు

కృష్ణా, శ్రీకాకుళం జిల్లాల్లో లంచం తీసుకుంటూ చిక్కిన అధికారులు

విశాలాంధ్ర-విజయవాడ: కృష్ణా, శ్రీకాకుళం జిల్లాల్లో అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీ వలలో చిక్కారు. డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ఏసీబీ 14400 కాల్ సెంటర్, ఏసీబీ యాప్ ద్వారా అవినీతి అధికారులపై వచ్చిన ఫిర్యాదులతో కృష్ణా జిల్లా, తాడిగడప మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకాకుళం జిల్లా, లావేరు మండలం వర్క్ ఇన్‌స్పెక్టర్ (హౌసింగ్) పైన శుక్రవారం దాడులు నిర్వహించారు. కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, కానూరు గ్రామానికి చెందిన బాధితుడు స్థానికంగా నూతనంగా నిర్మించిన ఇంటికి అసెస్‌మెంట్ నంబర్ (పన్ను స్థిరీకరణ, కొత్తగా నిర్మించిన ఇంటికి డోర్ నంబర్) కేటాయింపు కోసం తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. అయితే అసెస్‌మెంట్ నంబర్ ఇచ్చేందుకు తాడిగడప మునిసిపాలిటీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యరకరాజు వెంకట సుబ్బరాజు రూ.6 వేలు లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీనిపై అధికారులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకట సుబ్బరాజు సూచనలతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి కథారి నాగబాబు బాధితుడి నుంచి రూ.6 వేలు లంచం తీసుకుంటుండగా విజయవాడ అవినీతి నిరోధక శాఖ అధికారులు అతనిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అలాగే శ్రీకాకుళం జిల్లా, లావేరు మండలం, వల్లిపేట గ్రామనికి చెందిన బాధితుడు తన భార్య పేరు మీద జగనన్న గృహనిర్మాణ పథకం కింద ఇల్లు మంజూరయింది. అయితే ఇంటి నిర్మాణానికి రావలసిన బిల్లులను మంజూరు చేసేందుకు వర్క్ ఇన్‌స్పెక్టర్ (హౌసింగ్) ఎం.కన్నం నాయుడు రూ.13 వేలు డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన అధికారులు ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ హౌసింగ్ కార్యాలయం, లావేరు, శ్రీకాకుళం జిల్లాలో హౌసింగ్ విభాగం వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎం.కన్నం నాయుడు బాధితుడి వద్ద నుంచి రూ.13 వేలు లంచం తీసుకుంటుండగా శ్రీకాకుళం అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టుబడిన అవినీతి అధికారులను ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపర్చనున్నారు.

కాల్‌డేటా సేకరించాలి

ఎంపీ కృష్ణరాజుకు వేధింపుల కేసులో సీబీఐకి హైకోర్టు ఆదేశాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: నరసా పురం ఎంపీ రఘురామ కృష్ణరాజుకు సీఐడీ కస్టడీలో వేధింపులపై హైకోర్టు శుక్రవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణంరాజును అదుపులోకి తీసుకున్న సమయంలో కాల్ డేటాను వెంటనే సేకరించాలని సీబీఐని ఆదేశించింది. తనకు కస్టడీలో వేధింపులపై సీబీఐతో విచారణ కోరుతూ కృష్ణరాజు హైకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌ను న్యాయ స్థానం శుక్రవారం విచారించింది. టెలికం నిబంధనల ప్రకారం రెండేళ్ల కాల్‌డేటానే ఉంచుతారని కృష్ణరాజు తరపు న్యాయవాది నౌమీన్ హైకోర్టుకు తెలిపారు. కాల్ డేటాను వెంటనే సేకరించి, భద్రపర్చాలని ఆదేశాలివ్వాలని కోరారు. సీబీఐ తరపున అదనపు సోలిసిటర్ జనరల్ హరినాథ్ వాదనలు వినిపించారు. ఈ కేసులో ఎఫ్ఐఆర్... సీఐడీ వద్ద ఉందని, కాల్‌డేటాను సీఐడీ అధికారులే సేకరించాలన్నారు. పిటిషనర్ ఆరోపణలు చేసినది సీఐడీ మీద అయినప్పుడు ఆ సంస్థను కాల్‌డేటా సేకరించమని ఎలా అంటారని హైకోర్టు ప్రశ్నించింది. మరోవైపు ఈ కేసులో సీఐడీ ఇంప్లీడ్ పిటిషన్ వేసింది. కాల్‌డేటా సేకరించమనడం చట్టవిరుద్ధమని సీఐడీ తరపు న్యాయవాది వాదించారు. సీఐడీ పిటిషన్‌ను అనుమతించలేదని హైకోర్టు పేర్కొంది. సీబీఐకు ఇవ్వాలా, లేదా అనేది కోర్టు నిర్ణయించలేదని, ఈ కేసులో కాల్ డేటా కీలకమని న్యాయవాది నౌమీన్ అన్నారు. దీంతో కాల్ డేటాను సేకరించి భద్రపరచాలని సీబీఐని హైకోర్టు ఆదేశించింది. కేసు తదుపరి విచారణను వేసవి సెలవుల తర్వాత చేపడతామని పేర్కొంది.

జీవో.1 పై హైకోర్టు తీర్పు ప్రతిపక్షాల విజయం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీశ్

విశాలాంధ్ర - గుంతకల్లు: జీవో నంబర్ 1పై హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రతిపక్షాల విజయంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీశ్ పేర్కొన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద సీపీఐ శ్రేణులు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకొని, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ జీవో 1వచ్చిన వెంటనే రాష్ట్రంలోని ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాలు, పౌరహక్కుల సంఘాలు ముక్తకంఠంతో జీవో 1ని ఉపసంహ రించుకోవాలని జగన్‌ను కోరినాపట్టించుకోలేదన్నారు. వ శుక్రవారం న్యాయస్థానంలో ఓటమి పాలయ్యాడని చెప్పారు. ప్రతిపక్షాల గొంతుకను నొక్కడానికే జీవో 1 తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, మండల, పట్టణ సహాయ కార్యదర్శులు ఎస్ఎండి గౌస్, రామాంజనేయులు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి కుళ్లాయప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవేంద్ర, సీపీఐ నాయకులు మురళీకృష్ణ, మల్లయ్య, ఉమ్మర్ బాషా, పుల్లయ్య, ప్రసాద్, దౌలా, ఏఐవైఎఫ్ నాయకులు వంశీకృష్ణ , నందు, ఏఐఎస్ఎఫ్ నాయకులు వెంకట్, వినోద్, మహిళా సమాఖ్య నియోజకవర్గ కార్యదర్శి రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

చుక్కల భూముల్లోనూ కుంభకోణం: సోమిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: చుక్కల భూమి సమస్య పరిష్కారం పేరిట చేస్తున్న ఆర్భాటం వెనుక భారీ కుంభకోణం దాగివుందని వైసీపీ ప్రభుత్వ పథకాలపై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపణలు చేశారు. ఈ కుంభకోణం విలువ లక్ష కోట్లా రూపాయలా లేక అంతకు రెట్టింపా అన్నది విచారించాలన్నారు. 'నిషేధిత భూముల పరిష్కారం కోసం ఏపీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రతి జిల్లాలో ఒక ప్రత్యేక కమిటీ నియమించాలని, ప్రతి కమిటీలో ఒక రిటైర్డ్ జిల్లా జడ్జి తప్పనిసరిగా ఉండాలని, జిల్లా జడ్జి పర్యవేక్షణలోనే నిషేధిత భూములకు విముక్తి కల్పించాలని పేర్కొంది. అందుకోసం ప్రజల నుంచి దరఖాస్తులు ఆహ్వానించాలని సూచించింది. ఈ ఆదేశాలకనుగుణంగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం 2016లో జీవో నం.300, 2018లో జీఓ నంబర్ 575లను జారీ చేసింది. దీంతో అధికారులు ఒక పద్ధతి ప్రకారం నిషేధిత భూముల సమస్య పరిష్కారానికి యత్నిస్తున్నారు. కానీ జగన్ అధికారంలోకి వచ్చాక ఆ సమస్య మరుగున పడింది. ఎన్నికల సంవత్సరంలో ఆకస్మికంగా తెరపైకొచ్చింది. చుక్కల భూములు, నిషేధిత భూముల విముక్తి పేరిట హడావుడి మొదలైంది. చుక్కల భూమి విముక్తి పేరుతో దేవాదాయ శాఖతో సహా వివిధ ప్రభుత్వ భూములను సొంతం చేసుకోవడానికి జరుపుతున్న భారీ కుట్ర తప్ప ప్రజల సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో చేస్తున్నది కాదు' అని సోమిరెడ్డి విమర్శించారు. వాన్‌పిక్ భూములను సైతం ఆరగించేందుకు చుక్కల భూమి విముక్తి ప్రచారం చేస్తున్నారన్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం తమ భూము లను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ప్రజలు దరఖాస్తు చేసుకున్నప్పుడు మాత్ర మే కమిటీ పరిశీలన చేయాలి కానీ దరఖాస్తులు రాకున్నా, సుమోటోగా అధికారులతో ధ్రువీకరణ చేయించి, వేలాది ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తప్పిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, మొత్తం నిషేధిత జాబితా భూముల మీద హైకోర్టు ఆదేశాలను పాటించి, జిల్లా జడ్జి నేతృత్వంలో పరిశీలన జరిపించాలని సోమిరెడ్డి డిమాండ్ చేశారు. చుక్కల భూములు, భూరక్ష, శాశ్వత భూమి హక్కు వంటి మోసపూరిత పథకాలతో ప్రజల భూములను దురాక్రమించే ప్రయత్నం మానుకోవాలన్నారు.

విద్యుద్ఘాతానికి నాలుగు ఏనుగుల మృతి

మన్యం జిల్లా అటవీ, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణం : ప్రజాసంఘాలు

విశాలాంధ్ర-పార్వతీపురం : పార్వతీపురం మన్యం జిల్లాలో పాలకొండ డివిజన్, భామిని మండలంలోని కాట్రగడ్డ గ్రామ సమీపంలో శుక్రవారం వేకువజామున విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొని విద్యుద్ఘాతానికి గురై నాలుగు ఏనుగులు మరణించాయి. గత ఆరేడేళ్లుగా పార్వతీపురం రెవెన్యూ డివిజన్‌లోని ఎనిమిది ఏనుగులు, పాలకొండ డివిజన్‌లోని ఆరు ఏనుగులు జిల్లాలోని రైతులకు, ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎంతో మందిని పొట్టన పెట్టుకున్న సంగతి తెలిసిందే. పెద్ద ఎత్తున పశుసంపదను కూడా రైతులు కోల్పోయారు. రైతులు ఆరుగాలం కష్టపడి శ్రమించి పండించిన పంటలు నాశనమయ్యాయి. రైతులు తమ పంటలకు రావల్సిన నష్టపరిహారం కోసం అటవీ శాఖ అధికారులు చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారే తప్ప పరిహారం అందడం లేదు. అయినప్పటికీ శుక్రవారం జరిగిన సంఘటనలో ఏనుగులు మృత్యువాత పడటంపై జిల్లా ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఏనుగులు చనిపోవడం తమకు ఎంతో బాధ కలిగిస్తోందని వారు చెప్పడం గమనార్హం. ఏనుగుల పర్యవేక్షణలో అటవీ, విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. వారు ఎప్పుడూ ఏనుగుల సంరక్షణకు, అలాగే పంటలకు నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవని స్థానికులు చెబుతున్నారు. దీనిపై అటవీ, విద్యుత్ అధికారులను బాధ్యులుగా చేసి తక్షణమే సస్పెండ్ చేయాలని, పార్వతీపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఎనిమిది ఏనుగులు, భామిని పరిధిలో రెండు ఏనుగుల తరలింపుపై తక్షణమే ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు, సీపీఐ మన్యం జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, సహాయ కార్యదర్శి తోట జీవన్, జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, కుండంగి లింగరాజు, జిల్లా సమితి సభ్యులు పువ్వల ప్రసాద్, పత్తిక మోహనరావు తదితరులు డిమాండ్ చేశారు. ఇదిలాఉండగా, ఏనుగుల మృతిపై జిల్లా అటవీ అధికారి శుక్రవారం ఒక ప్రకటనను విడుదల చేస్తూ 2023 ఫిబ్రవరి మొదటి వారంలో ఒడిశా సరిహద్దుల నుంచి ప్రవేశించాయని పేర్కొన్నారు. సంఘటన సమాచారం అందగానే చీఫ్ కన్జర్వేటర్ సంఘటనా స్థలానికి విచ్చేశారని, విశాఖపట్నం జూపార్క్ నుంచి వెటర్నరీ వైద్యులు, స్థానిక వెటర్నరీ వైద్యులు వచ్చారని వివరించారు. స్థానిక విద్యుత్ శాఖ అధికారులు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారుల సమక్షంలో సంఘటనా స్థలంలోనే వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారని ఆమె తెలిపారు. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల అటవీ సిబ్బంది కూడా హాజరయ్యారని అన్నారు.

లక్షల కోట్ల అప్పుతో ఏపీ ఆర్థిక వ్యవస్థ కుదేలు

బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్

విశాలాంధ్ర-హైదరాబాద్: అభివృద్ధి శూన్యం, అప్పులు ఘనమన్న చందంగా ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ అసమర్థ పాలన సాగుతోందని బీఆర్ఎస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ తోట చంద్రశేఖర్ విమర్శించారు. హైదరాబాద్‌లోని పార్టీ క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ లక్షలాది కోట్ల అప్పులతో ఏపీ ఆర్థిక వ్యవస్థ కుదేలైందన్నారు. పెరిగిన నిత్యావసర ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు జీవించలేని దయనీయ పరిస్థితిలో ఉన్నారని అన్నారు. జగన్ సీఎం అయినప్పటి నుంచి పరిమితికి మించి అప్పులు రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్ గా మార్చారని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, యువత ఉపాధి అవకాశలు లేక పొరుగు రాష్ట్రాలకు తరలి వెళ్తుంటే చూస్తూ మిన్నకుండిపోవడం ఇక్కడి పాలకుల వంతైందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఏడాది నుంచే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రతినెల జీతాల కోసం ఎదురు చూడాల్సిన దుర్భర పరిస్థితులు ఉన్నాయన్నారు. మాట తప్పను మడెం తిప్పను అన్న జగన్ మాటలన్నీ నీటి మూటలేనని రుజువయ్యాయని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి ప్రజలకు అభివృద్ధితో కూడిన సంక్షేమ పాలన అందించకుంటే రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇదిలావుంటే, విజయనగరం జిల్లా మెంటాడ మండలం పెద్ద మేడపల్లి గ్రామానికి చెందిన మాదిరెడ్డి జగన్‌తో సహా అనేకమంది జిల్లా నాయకులు, కార్యకర్తలు తోట చంద్రశేఖర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

సంపాదకీయం

భావస్వేచ్ఛకు ఊపిరి!

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాజాగా ఇచ్చిన ఓ మంచి తీర్పు రాష్ట్రంలో భావస్వేచ్ఛకు ఊపిరిలూదింది. పౌరహక్కులకు కాస్త ప్రాణం పోసింది. ఏపీలో జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగు మాసాల క్రితం అంటే జనవరి 2వ తేదీన రాత్రికి రాత్రి జారీ చేసిన చీకటి జీవో (జీవో నెంబర్ 1)ను హైకోర్టు శుక్రవారంనాడు రద్దు చేసింది. సభలు, ర్యాలీలపై 'జగన్ రాజ్' దూసిన కత్తిని విరిచేసింది. ఒకవిధంగా చెప్పాలంటే జగన్ సర్కారు అరాచకాలకు ఇది అడ్డుకట్ట వేయడమే. ప్రతిపక్షంలో వున్నప్పుడు నడిచిన దారిని అధికారంలోకి వచ్చాక మరిచిపోయి, అడ్డదారిలో రాక్షస జీవోలను విడుదల చేస్తున్న జగన్‌కు తాజా తీర్పు ఓ చెంపపెట్టు.

జగన్ ప్రభుత్వం జీవో నెంబరు 1ను తీసుకువచ్చిన నేపథ్యం అందరికీ ఎరుకే. 2023వ సంవత్సరం ప్రారంభంలో తెలుగుదేశం పార్టీ నిర్వహించిన ఒకటి, రెండు సభల్లో తొక్కిసలాట జరిగింది. ముఖ్యంగా గుంటూరులో ఉయ్యూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన చంద్రన్న సంక్రాంతి కానుక పంపిణీ సభలో జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు పౌరులు మృతిచెందారు. దీంతో ఈ ఘటనలను సాకుగా చూపి జగన్ సర్కారు రాత్రికి రాత్రే జీవో1ను తీసుకువచ్చింది. ఇలాంటి ఘటనలు కొత్తేమీ కాదు, దాన్ని అడ్డుకోవాలని తెచ్చిన జీవో కూడా గొప్పేమీ కాదు. పాతచట్టాల్లోని అంశాలను ఏ రాష్ట్రమైనా అమలు చేయాలనుకుంటే, అందుకు గెజిట్ జారీ చేయాల్సివుంటుంది. ఆనాడు గెజిట్‌లో పెట్టకుండానే జీవో నెం.1ను అమల్లోకి తేవడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ప్రతిపక్ష పార్టీలన్నీ ముక్తకంఠంతో ఈ జీవోను వ్యతిరేకించడం గమనార్హం. సీపీఐ ఒకడుగు ముందుకేసి, ఈ రాక్షస జీవోపై పెద్దఎత్తున ప్రజాఉద్యమాన్నే లేవనెత్తింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఈ జీవోను సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఆ తర్వాత టీడీపీ నాయకుడు కొల్లు రవీంద్ర, కాంగ్రెస్ నాయకుడు రుద్రరాజు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, ఏఐవైఎఫ్ అధ్యక్షులు రాజేంద్రబాబు తదితరులు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ జీవో రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమని, ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం కుట్రపూరితంగా ఈ జీవో జారీ చేసిందని రామకృష్ణ తరపు న్యాయవాది విన్పించిన వాదనలపై హైకోర్టు సానుకూలంగా స్పందించి, ఈ జీవో అమలుపై స్టే విధించింది. ఆరు నూరైనా అరాచక జీవోను అమలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించినా..దీన్ని హైకోర్టులోనే తేల్చుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం తిప్పిపంపింది. తిమ్మినిబమ్మి చేయడానికి జగన్ ప్రభుత్వం చేసిన విశ్వప్రయత్నాలు నిష్ఫలమయ్యాయి. అప్పటికే నైతికంగా ఓడిన జగన్ ఎట్టకేలకు హైకోర్టులోనూ చిత్తయ్యారు.

ఈ ప్రపంచం ఎందరినో నియంతలను, వారి దుర్మార్గపు పాలనను చవిచూసింది. అవన్నీ పరాభవంతోనే కాలగర్భంలో కలిసిపోయిన విషయం అక్షరసత్యం. చీకటిజీవోలతో ప్రజాస్వామ్యాన్ని హతమారుస్తున్న జగన్ ప్రభుత్వం నిండునూరేళ్లు బతుకుతుందని ఆశించడం అర్థరహితం. నిజానికి ఈ జీవో 162 ఏళ్ళ క్రితం నాటిది. స్వేచ్ఛావాయువుల కోసం పోరాటం సల్పడానికి భారతీయులు చేపట్టిన స్వాతంత్రోద్యమాన్ని అణగదొక్కేందుకు 1961లో బ్రిటిష్ రాజ్యం తీసుకువచ్చిన పోలీస్‌యాక్ట్‌ను ఈనాడు జగన్ రాజ్యం 'అద్వితీయమైన పరిశోధనలు, తవ్వకాలు నిర్వహించి, వెలికితీసి, బూజుపట్టిన నాటి చట్టాన్ని గట్టిగా దులిపి, దానికి రంగులద్ది కొత్తగా తీసుకువచ్చిన ఉత్తర్వు ఈ జీవో నెం.1'. 1858లో ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనపోయి భారత్ నేరుగా బ్రిటిష్ రాణి పాలన కిందకు వచ్చిన తర్వాత నిరసనలను చట్టబద్ధంగా అణచివేసేందుకు 1961లో తీసుకువచ్చిన పోలీస్‌యాక్ట్‌లో పోలీసుల అధికారాలు, విధులను పొందుపరిచారు. అందులోని సెక్షన్ 30 ప్రకారం, బ్రిటిష్‌రాజ్యంలో సభలు, సమావేశాలు, ఊరేగింపులకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాల్సి వుంటుంది. పైగా సందర్భానుసారంగా దీన్ని అమలు చేయాలి. కాకపోతే, ఆనాటి చట్టం సైతం ఆంధ్రాప్రాంతానికి వర్తించలేదు. ఎందుకంటే, ఆనాటి ఆంధ్రాప్రాంతం మద్రాస్ ప్రెసిడెన్సీలో భాగంగా వుండేది. మద్రాస్ ప్రెసిడెన్సీ, బాంబే ప్రెసిడెన్సీల్లో సొంత పోలీసు చట్టాలున్నందున ఆ ప్రాంతాల్లో 1961 యాక్ట్ వర్తించదని బ్రిటిష్‌వారే స్పష్టంచేశారు. ఏ రాష్ట్రమైనా ఈ చట్టాన్ని గానీ, ఇందులో కొంతభాగాన్ని గానీ అమలు చేసుకోవచ్చని బ్రిటిష్‌వారు పేర్కొన్నప్పటికీ, ఆనాడు మద్రాస్ ప్రెసిడెన్సీ దీన్ని అమలుకు స్వీకరించలేదన్నది నగ్నసత్యం. బ్రిటిష్ కాలంలోనే వర్తించని ఈ చట్టం ఈనాడు జగన్ ప్రభుత్వంలో వర్తిస్తుందా? 'పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమల్లో వుందని' అప్పుడప్పుడూ పోలీసులు ప్రకటనలు చేసినా..ఇవి తీవ్రంగా అమలైన దాఖలాలు లేవు. ఆ తర్వాత చంద్రబాబు ప్రభుత్వం 2014లో పోలీస్ రిఫామ్స్ యాక్ట్‌ను తీసుకువచ్చింది. రాష్ట్ర విభజన తర్వాత ఇదే అమల్లో వుంది. ఉన్నట్టుండి జగన్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై అక్కసుతో తీసుకువచ్చిన జీవో నెం.1 ఉద్దేశానికి, స్వేచ్ఛను హరించాలనే ఆనాటి బ్రిటిష్ వారి నీచమైన లక్ష్యానికి భావసారూప్యత వుందని రుజువైంది.

జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నవ్యమైన నవరత్నాలిస్తే, పాలన సవ్యంగా సాగిపోతుందన్న భ్రమలో వుంటూ వచ్చారు. గడిచిన నాలుగేళ్లలో రాష్ట్రంలో ఏనాడూ లేనంతగా పౌరహక్కులు మృగ్యమయ్యాయి. కేంద్రంలోని మోదీ పాలనకు దీటుగా జగన్ సర్కారు ప్రజల ప్రాథమిక హక్కులను, ప్రజాస్వామ్య నీతిని హరిస్తోంది. మనం అభివృద్ధి చెందుతున్నామా? లేక మరింత నిర్బంధంలోకి వెళ్తున్నామా? అన్న అనుమానం జీవో నెం.1తో వచ్చేసింది. పౌరహక్కులు, ప్రాథమిక హక్కులకు విఘాతం కల్పించడమే గాక ప్రతిపక్షాలనూ, ప్రజలనూ నిర్బంధంలో వుంచడమే ఈ జీవో పరమోద్దేశమన్నది జగమెరిగిన సత్యం. సీఎం కాక మునుపు ఓదార్పు యాత్రల పేరుతో వేలకిలోమీటర్లు రోడ్లపై నడిచి, ప్రభుత్వంపై విరుచుకుపడిన ఆనాటి జగన్‌కు వర్తించని జీవోలు, ఈనాడు ప్రతిపక్షాలకు వర్తించేలా చేయడం రాజ్యాంగంలోని 19వ అధికరణ ప్రజలకు ప్రసాదించిన భావస్వేచ్ఛ హక్కును హననం చేయడమే అవుతుంది. ఈ విషయం హైకోర్టు న్యాయమూర్తులు తమ తీర్పులో ప్రస్ఫుటంగా పేర్కొన్నారు. రేపొద్దున జీవించే హక్కునూ జగన్ ప్రభుత్వం హరించినా ఆశ్చర్యపోనవసరం లేదు. జీవో నెం.1ను రద్దు చేయాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు జగన్ ప్రభుత్వానికి, విషపు గుళికల్లాంటి సలహాలిస్తున్న జగన్ 70 మంది సలహాదారులకూ ఈ తీర్పు గుణపాఠం అవుతుందని ఆశిద్దాం! లేకుంటే.. ప్రజాకోర్టు 'తుదితీర్పు' ఇవ్వాల్సి వుంటుంది!

మన కాలం వీరులు...

చక్రవాకం

\- ముక్కాముల చక్రధర్

కాలం కడుపుతో ఉండి కారల్ మార్క్సుని కంది. ప్రతీ తరంలోనూ కాలం కడుపుతో ఉండి గొప్పవారిని కంటుంది. వాళ్లని గుర్తించడం కష్టమే. గుర్తించామా ఇక వాళ్లకి ఆకాశమే హద్దు. మనకి ఆనందమే హద్దు. కాలం ఒక్క కమ్యూనిస్టులనే లోకానికి ఇవ్వదు. కళాకారులను ఇస్తుంది. నటులనిస్తుంది. కవులు, రచయితలు, డాక్టర్లు, ఇంజనీర్లు ఆలా అన్ని రంగాల నుంచి గొప్పవారిని ఎంపిక చేసి ఇస్తుంది. అన్నట్లు ఆటగాళ్లని కూడా ప్రతి తరానికి ఇస్తుంది. అలాకాలం ప్రపంచానికిఇచ్చిన బహుమతులే బ్రాడ్‌మెన్, రిచర్డ్స్, ఫుట్‌బాల్ దిగ్గజాలు పీలే, మరడోనా, టెన్నీస్‌లో మార్టినా నవ్రతిలోవా, మన దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లి, చెస్ రారాజు విశ్వనాథన్ ఆనంద్...ఇలా అన్నమాట. ఈ తరం నుంచి కూడా కాలం తన పని తాను చేసింది. ప్రతికాలానికి ఓ రూపం ఉంటుంది. ఈ కాలానికి ఆ రూపం పేరు ఐపీఎల్.

ఆ కుర్రాడ్ని చూశారా. మిల్రటీ కటింగ్. నూనూగు మీసాల నూత్న యవ్వనం. ముఖ్యంగా ఆ కళ్లని గమనించండి. ఎంత ప్రశాంతంగా ఉన్నాయో. ప్యాడ్‌లు కట్టుకుని, హెల్మెట్ పెట్టుకుని, గ్లౌజ్ తొడుక్కుని పిచ్ మీదకి వచ్చిన సమయం కూడా పట్టలేదు. అలా వచ్చీ రాగానే మొదటి బంతి సిక్స్...రెండోబంతి మరో సిక్సర్. ఆ తర్వాత మూడుఫోర్లు... మొత్తం 26 పరుగులు. ఇంతకీ ఆ కుర్రాడు ఎవరనుకుంటున్నారా. ఇంకెవరు యశస్వి జైస్వాల్. దిగువ మధ్యతరగతికి చెందిన ఈ యశస్వి జైస్వాల్... బ్యాటింగ్ విశ్వరూపం ప్రదర్శించాడు. నిజానికి తొలి ఓవర్‌లోనే రాజస్థాన్ రాయల్స్‌కి విజయం అందించాడు ఈ కుర్రాడు జైస్వాల్.

ఆ ఓవర్ ముగిసిన తర్వాత తెలుగు వ్యాఖ్యాతలు అన్నారూ...కోల్‌కతా కెప్టెన్ నితీష్ రాణా ఆ తొలి ఓవర్ వేయకుండా ఉండాల్సిందని.... కానీ, ఆ తర్వాత బౌలింగ్ చేసిన వారికీ ఇదే చేదు అనుభవం. "బౌలింగ్ ఎవరు చేస్తున్నారన్నది కాదు....కొట్టామా...? లేదా...?"అని జైస్వాల్ సమాధానం. మళ్లీ ఇంకో మాట కూడా అనే ఉంటాడు మరాఠీలో "చరిత్ర అడక్కు.. కొట్టింది చూడు". ముంబాయి కుర్రాడు కదా.... అందుకని మరాఠీలోనే జవాబు ఇచ్చి ఉంటాడని నాకనిపించింది. గురువారం రాత్రి సరిగ్గా 9-15 నిమిషాలకు కొల్‌కతా వర్సెస్ రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్ చూసిన వారందరికీ ఇలాగే అనిపించింది. అనిపించాలి కూడా. ఇదేదో లక్కు తగిలి ఇలా కొట్టాడనుకోకండి. ఈ ఐపీఎల్ సీజన్‌లో జైస్వాల్ ఆడిన మ్యాచ్‌ల్లో ఒకటో, రెండో ఫెయిల్యూర్లు ఉన్నాయి తప్ప మిగిలిన మ్యాచ్‌లన్నింటిలోనూ బౌలర్లకు ఊచకోతే. ఈ బ్యాటింగ్ వీరంగాన్ని మాయంటామా... మిథ్యంటమా.... కళ్లముందు కనపడుతున్న వాస్తవం అనాల్సిందే.

ఈ కుర్రాడే కాదు...హైదరాబాద్ కుర్రాడు మహ్మద్ సిరాజ్ కూడా ఇలా వచ్చిన వాడే. అంతెందుకు మా కోనసీమ కుర్రాడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ బ్యాడ్మింటన్ డబుల్స్‌లో సంచలన విజయాలు సాధిస్తున్నాడు. అన్నట్లు ఇలాంటి కుర్రాళ్లెవరికీ ర్యాంకుల బాధ లేదు. ఈ మాట ఎందుకంటే ర్యాంకులు, పెద్ద పెద్ద ఉద్యోగాలు చాలామంది సాధిస్తారు. ఓ జైశ్వాల్, మరో సిరాజ్, మన సాత్విక్ సాయిరాజ్... వీళ్లకి ఎలాంటి ర్యాంకులు ఇవ్వాలి. అన్నట్లు వీళ్లంతా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలనుంచి వచ్చినవారే. గురువారం క్రికెట్ చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిన జైశ్వాల్ ఫ్లాట్ ఫాం మీద పానీపూరీ విక్రయించే కుటుంబం నుంచి వచ్చాడు. మహ్మద్ సిరాజ్ ఓ ఆటో డ్రైవర్ కుమారుడు. ఇక సాత్విక్ సాయిరాజ్... మా రంకిరెడ్డి కాశీగాడు అని ప్రేమగా పిలుచుకునే ఉపాధ్యాయ దంపతుల పుత్రుడు. "అగాథమౌ జలనిధిలోనా... ఆణిముత్యమున్నటులే" అని శ్రీశ్రీ అన్నట్లుగా వీరంతా ఆణిముత్యాలు. వెదకాలంతే. పట్టుకోవాలంతే. అవకాశాలు ఇవ్వాలంతే. అలా... ఇలా అవకాశం ఇచ్చిన ఐపీఎల్‌కి థాంక్స్ చెప్పాల్సిందే. ఈ కుర్రాళ్లను కొనుగోలుచేసిన ఫ్రాంఛైజీలకు థాంక్స్ చెప్పాల్సిందే. వీరికే కాదు.... ఇలాంటి వారిని ఎన్నో త్యాగాలుచేసి మనకందించిన ఆ తల్లిదండ్రులకు ప్రణమిల్లాల్సిందే. చిన్నమాట...విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఏడవ తరగతిలో పరీక్ష తప్పాడు. తన స్నేహితుడికి ఫస్ట్‌ర్యాంక్ వచ్చిందని చాలా ఆనందంగా తన తాతనోట్లో పంచదార పోశాడు రవీంద్రుడు. అన్నట్లు...ఆ ఫస్ట్‌ర్యాంక్ వచ్చిన స్నేహితుడెవరో మీరెవరైనా చెప్తారా....ఆ ర్యాంకర్ స్నేహితుడు ఎవరో నేనే కాదు ప్రపంచమంతా చెబుతుంది. ఈ లాజిక్ మిస్ అవుతున్నారేమిటో....

సీనియర్ జర్నలిస్ట్, 9912019929

జి-20 అధ్యక్షత దేశానికి ఉపయోగమా?

డి. రాజా,
సీపీఐ ప్రధాన కార్యదర్శి

జి-20 దేశాల గ్రూపు అధ్యక్ష పదవి మనకు దక్కిందంటూ ఏదో సాధించినట్లు ఉవ్వెత్తున ప్రచారం చేస్తున్నారు. సరిహద్దు సమస్యలు, ప్రపంచ ఆర్థిక సంక్షోభాలను అధిగమించేందుకు తగిన చర్యలు చేపట్టడంకోసం 1999లో జి-20 దేశాల గ్రూపు ఏర్పడింది. నయా ఉదారవాదం ప్రపంచమంతటా ప్రభావం చూపుతున్న సమయంలోనే ఇది ఏర్పడింది. అయితే ఆర్థిక ధోరణులను అనుసరించడంలో విఫలమైంది. 2008లో సంభవించిన ఆర్థిక సంక్షోభాన్ని నిలువరించలేకపోయింది. అనంతరం జి8/జి7 గ్రూపుల ప్రభావం సంక్షోభ సమయంలో విధానాలపై ప్రధానంగా పడింది. అలీన ఉద్యమం(నామ్) లేదా జి77 దేశాల గ్రూపులో ప్రస్తుతం 134 అభివృద్ధి చెందిన దేశాలు సభ్యులుగా ఉన్నాయి. జి20 దేశాల గ్రూపు అధ్యక్షపదవి భారత్‌కు దేశీయంగా, అంతర్జాతీయంగా ప్రజలకు కలిగిన చిక్కులు, ప్రయోజనాలను పరిశీలిద్దాం.

ముఖ్యంగా బీజేపీ దాని అనుకూల మీడియా ప్రతి సంవత్సరం జరిగే ఈ తంతును గొప్పవిజయంగా, అంతర్జాతీయంగా భారతదేశ ప్రభావం పెరుగుతున్నదనేందుకు తార్కాణమని బాకా ఊదారు. భ్రమల ప్రచారం, మోదీ వ్యక్తిగత ఆకర్షణను పెంచేందుకు సాగిన ప్రచారంతో ప్రజలు విసిగిపోయారు. దౌత్యవేత్తలంతా మనవైపే చూస్తున్నారని ప్రచారం చేస్తున్నారు. రొటేషన్ పద్ధతిలో భారతదేశానికి అధ్యక్ష పదవిని ఇచ్చారు. భారతదేశానికి ఇచ్చిన గొప్ప బహుమతి ఏమీకాదు. గత సంవత్సరమే భారతదేశానికి అధ్యక్ష పదవి ఇవ్వలసిందని జీ-20 గ్రూపు వెల్లడించింది. 2023లో 9 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, 2024లో పార్లమెంటు ఎన్నికలు జరుగనుండటం, జి20 గ్రూపు అధ్యక్ష పదవిపైన విస్తృత ప్రచారం చేసుకుని రాజకీయ ప్రయోజనం పొందడానికి ప్రయత్నించారు.

జి20 సమావేశాలకు విదేశీ ప్రముఖులు హాజరైన సందర్భంలో వారందరికి ప్రధానమంత్రి స్వాగతం పలుకుతున్నట్లు, భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. ఈ హోర్డింగ్‌లకు, ప్రచారానికి విపరీతంగా ఖర్చు చేశారు. ఇదంతా కూడా ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేసిందే...అధ్యక్షపదవి తీసుకున్న తర్వాత ప్రధానమంత్రి బ్లాగ్-పోస్టులో తన అజెండాను వివరించారు. ప్రచారానికి, వాస్తవానికి ఎంతో తేడాఉందని బ్లాగ్ పోస్టు స్పష్టం చేస్తుంది. "భాషలు, మతాలు, సంప్రదాయాలు, నమ్మకాలు అత్యంతవైవిధ్యంగా ఉన్నాయని ఈ విషయంలో భారతదేశం ప్రపంచంలోనే మేలుగా ఉందని ఆయన చెప్పుకున్నారు.

ఈ వైవిధ్యం చాలా కాలంగా దేశపటిష్టతకు చిహ్నంగా ఉండింది. అయితే మోదీ హయాంలో ఇది తీవ్రమైన వత్తిడులకు గురైంది. ఆర్ఎస్ఎస్-బీజేపీలు

ఏకత్వం గురించి అదే పనిగా ప్రచారం చేస్తున్నారు. మనవైవిధ్యాన్ని నాశనంచేసి విభేదాలను సృష్టిస్తున్నారు. అది హిందీనిరుద్దడం, లేదా మతమైనారిటీలపై వివక్ష, గోమాంసం తింటున్నారని దాడులు, హత్యలు గావించడం, చివరకివీరు వేసుకునే దుస్తులపైన కూడా ఆంక్షలు విధించడం చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలం అంతా ఒకే విధంగా ఉండాలనేది దేశసమాఖ్య వ్యవస్థను ధ్వంసం చేయడం మోదీ నిరంతరం సాగించే ప్రక్రియ. పైగా భారతదేశం ప్రజాస్వామ్యానికి మూలాధారమని దాని డీఎన్ఏలోనే ప్రజాస్వామ్యముందని ప్రధాని తన బ్లాగ్‌లో పేర్కొన్నారు. అయితే మెజారిటీ నినాదం భారతదేశ ప్రజాస్వామ్య లక్షణంపైనే దాడిచేస్తుంది. పార్లమెంటును ఎందుకూ పనికిరాకుండా తయారుచేస్తుంది. న్యాయవ్యవస్థను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తుంది. ప్రతిపక్షనాయకులపై దర్యాప్తు ఏజన్సీలను ప్రయోగించి వారిని దోషులుగా నిలిపేందుకు కోలుకున్నది. మీడియాను తనకు అనుకూలంగా మలచుకుంది. అసమ్మతిని నేరంగా పరిగణిస్తూ పౌరహక్కులను హరిస్తోంది. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించేవారిపై క్రూరమైన చట్టాలను ప్రయోగిస్తున్నది. సెక్యులర్, ప్రజాస్వామ్య వ్యవస్థ, స్వాతంత్ర్య పోరాటం తీవ్ర ప్రమాదానికి లోనవుతున్నాయి. అదానీ లాంటివారి కుంభకోణాలను ఆర్థికపెట్టుబడి పాత్రను పార్లమెంటులో ప్రస్తావించడానికి లేకుండా చేస్తున్నారు.

జి-గ్రూపు శిఖరాగ్ర సమావేశంలో 'ఒక ధరిత్రి, ఒక కుటుంబం, ఒకే భవిష్యత్తు' అని ప్రధాని మంత్రోపదేశం చేశారు. మోదీ పరిపాలనకు ఇదొక మచ్చుతునక. మత మైనారిటీలను దృష్టిలో ఉంచుకుని వివాదాస్పదమైన పౌరచట్ట (సవరణ) చట్టాన్ని తీసుకువచ్చారు. ఈ చట్టాన్ని తిరస్కరిస్తూ దిల్లీలో జరిగిన నిరసనోద్యమం సందర్భంగా సాగించిన దాడులను అంతర్జాతీయంగా ఖండించారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త గోల్వాల్కర్ స్వాతంత్ర్యానికి ముందుగానే మైనారిటీలు దేశంలో ఉండదలచుకుంటే ద్వితీయశ్రేణి పౌరులుగానే ఉండాలని, వారికి ఎటువంటి హక్కులు ఉండకూడదని తన రచనల్లో పేర్కొన్నారు. ఒక ధరిత్రి, ఒక భవిష్యత్తు అనే అంశమే ఊహించడం కష్టం. అలీన విధానాన్ని అనుసరించినప్పుడే భారతదేశ ప్రాముఖ్యత పెరిగింది. గత కొద్దిసంవత్సరాలుగా అమెరికా నాయకత్వంలోని పాశ్చాత్య దేశాలతో సాన్నిహిత్యం ఏర్పరచుకోవడం వల్ల మనకు అనేక సమస్యలు ఎదురయ్యాయి. దక్షిణాసియా దేశాలలో సంప్రదాయంగా మనకుగల మంచిపేరు క్రమంగా క్షీణించిందన్న అంశం గుర్తించాలి. జి-20 దేశాల అధ్యక్షస్థానం పొందినవెంటనే ప్రధాని అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ప్రభుత్వం వైపునుంచి, దక్షిణ దేశాల గురించి, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంస్థల సంస్కరణలను వివరించారు. అయితే జి20 గ్రూపు అధ్యక్షపదవి వల్ల మనకు లభించేదేమిటో చెప్పలేదు. బహుళ అభివృద్ధి బ్యాంకులకు సంబంధించి జి20 నిపుణుల బృందం ద్వారా కొన్ని సూచనలు వస్తున్నాయి. ఆ బృందం నివేదికలో వచ్చే అవకాశమున్న సమస్యలు, సిఫారసుచేసే చర్యలు చాలా భిన్నంగా ఉన్నాయి. నివేదికలో ప్రైవేటు పెట్టుబడి పెంచేందుకు నూతన యంత్రాంగాలు, నిర్దిష్టమైన పెట్టుబడి, వ్యయప్రాధాన్యతలు ఉన్నాయి.

స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న నాయకులు విదేశాలపైన చాలా జాగరూకతతో ఉన్నారు. అవసరమైన దేశాలకు సంఘీభావం, మద్దతు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అణచివేతకు గురైన సంస్థల ఐక్యత, అలీన ఉద్యమం తదితర అంశాలు అత్యంత ప్రముఖంగా ముందుకువచ్చాయి. విముక్తిపొందిన వలసదేశాల అభిప్రాయాలు, ఆఫ్రో-ఆసియా దేశాల ఐక్యత, శాంతి ప్రముఖస్థానం వహించాయి. వీటిని విస్మరించి పశ్చిమ దేశాలకు ముఖ్యంగా అమెరికా నాయకత్వంలోని సైనిక కూటమికి దగ్గరగా చేరారు. అనేక ముఖ్యమైన సమస్యలపై అర్థవంతమైన స్థానాలను పొందడంలో నూతన విధానం విఫలమైంది. కొద్దిసంవత్సరాలుగా భారతదేశ విదేశాంగ విధానం ప్రాధాన్యతలు సంకుచితంగా మారాయి. సహకారం, సంఘీభావం, శాంతి, పురోగతి విధానాన్ని అనుసరించడానికి బదులుగా మన దౌత్యవేత్తలు నాయకుడి ప్రతిష్టను పెంచేందుకు ప్రచారం సాగించడంలో నిమగ్నమయ్యారు. స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అవలంబించడానికి సిద్ధంగా లేరు. ప్రధానికి ఇష్టమైన పదం 'వసుధైక కుటుంబం' సామాజిక సామరస్యానికి ఇది ప్రతీక. ప్రపంచమంతా ఒకే కుటుంబం అని చెప్పడానికి ఇది నిదర్శనం. జి20 గ్రూపు అధ్యక్షపదవి మన దేశ ఔదార్యాన్ని ప్రదర్శిస్తుందని ప్రజలందరినీ సమంగా ఒక కుటుంబం లాగాచూడాలి. దక్షిణదేశాలను ఒక కుటుంబాన్ని ప్రతిబింబించాలి.

తీర్పు స్ఫూర్తిదాయకం

దిల్లీ పాలనా వ్యవహారాలపై సుప్రీంకోర్టు బెంచ్ స్ఫూర్తిదాయకమైన తీర్పు వెలువరించింది. చాన్నాళ్లుగా దిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికీ, కేంద్ర ప్రభుత్వానికీ మధ్య నలుగుతున్న వివాదానికి ముగింపు పలికింది. 2015లో కేంద్ర హోం శాఖ అక్కడి పాలనా వ్యవహారాల్ని కేంద్రమే చూస్తుందంటూ వెలువరించిన ఉత్తర్వు పై అక్కడి రాష్ట్ర సర్కారు కోర్టు మెట్లెక్కింది. ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వానికే పాలనా వ్యవహారాలపై పూర్తి అధికారముందని సుప్రీంకోర్టు తీర్పు వెలువడింది. ఇది అక్కడి ఆప్ సర్కారుకి పెద్ద ఊరట. అంతేకాదు ఎన్నికలకు, ప్రజాస్వామ్యానికి విలువనిచ్చే తీర్పు. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు. వారి సమ్మతితో ఎన్నికైన ప్రభుత్వానికి, అందులో మంత్రులకు ఆ ప్రజల తరపున అధికార దండం ఉంటుంది. ఆ దండాన్ని ప్రజల తరపున, వారికి సంబంధించిన పాలనా వ్యవహారాల కోసం వినియోగించాల్సి ఉంటుంది. వాటిని అమలు చెయ్యడానికి కార్య నిర్వాహక వ్యవస్థ ఉంటుంది. మంత్రివర్గం తప్పొప్పులు ఎప్పటికప్పుడు చెక్ చెయ్యడానికి శాసన వ్యవస్థ, ప్రజా తీర్పు కోసం ఎన్నికల వ్యవస్థ ఉన్నాయి. అమలు చెయ్యాల్సిన కార్యనిర్వాహక వ్యవస్థకు అలాంటి చెక్‌లు లేవు. కాబట్టి అవి జవాబుదారీ తనం, బాధ్యత స్పష్టంగా ఉన్న మంత్రివర్గం ఆదేశాల్ని .. అవి రాజ్యాంగబద్ధమే అయినప్పుడు... తప్పనిసరిగా అమలు చెయ్యాలి తప్ప వారే నిర్ణయాధికారం తీసుకోలేరు. తీసుకోకూడదు. ఎన్నికైన ముఖ్యమంత్రి ద్వారా వెలువడిన నిర్ణయాల్ని, ఎన్నికవ్వని కార్యనిర్వాహక వ్యవస్థ హెడ్...లెఫ్టినెంట్ గవర్నర్ స్వయం నిర్ణయంతోనో, లేదా కార్యదర్శుల నిరాకరణ ద్వారానో పక్కన పెడితే ప్రజాస్వామ్యానికి అర్థం లేకుండా పోతుంది. అలాంటి స్థితిని తప్పించి పాలనకు సంబంధించిన పగ్గాలు ఎన్నికైన రాష్ట్రప్రభుత్వం చేతిలోనే ఉండాలని సుప్రీం స్పష్టం చెయ్యడం ముదావహం. అలాగే అక్కడి ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా శాంతిభద్రతలు, భూ నిర్వాహణ, రక్షక వ్యవస్థ కేంద్రం చేతిలోనే ఉంచడం సరైనది. కేంద్రమైనా, రాష్ట్రమైనా ప్రజల కోసమే పనిచేస్తున్నప్పుడు ఇలాంటి తగవులు రావడం హాస్యాస్పదం. అందులోనూ కేంద్రంలో, రాష్ట్రంలో భిన్నమైన పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు పాలనకన్నా పెత్తనంపై దృష్టి పెట్టడం, ఆ తగవులు తీర్చడానికి న్యాయవ్యవస్థ రంగంలోకి రావడం తప్పనిసరైంది.

డా. డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, 94408 36931.

నిప్పుల కొలిమిలో ప్రపంచదేశాలు

అసాధారణ ఉష్ణోగ్రతలు, దీర్ఘకాలం కొనసాగుతున్న వడగాలులు, తీవ్రమైన వాతావరణ మార్పులతో ప్రపంచ మానవాళి, ప్రాణి కోటి నిప్పుల కొలిమిలో నివసించాల్సిన అగత్యం ఏర్పడుతున్నదని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాతావరణ ప్రతికూల మార్పులతో ప్రతి వేసవిలో దేశాల గరిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. కార్చిచ్చులు, హరికేన్లు, వరదలు లాంటి విపత్తులతో అధిక ఆస్తి, ప్రాణ నష్టాలు నమోదు అవుతున్నప్పటికీ నేడు వాతావరణ ఉష్ణోగ్రతలు పెరగడం, వడగాడ్పులు వీచడంతో సకల ప్రాణికోటి ఉనికి ప్రమాదంలో పడనుందని తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 2030-2050 మధ్య కాలంలో ప్రతికూల వాతావరణ మార్పులతో పోషకాహారలోపం, మలేరియా, డయేరియా, ఉష్ణోగ్రత ఒత్తిడుల కారణంగా అదనంగా 2.5 లక్షల మరణాలు నమోదు కావచ్చనే భయానక వార్తలను వెల్లడిస్తున్నారు.

"వాతావరణ మార్పులపై ఐరాస అంతర్ ప్రభుత్వం బృందం" (ఐసిసి) నివేదిక ప్రకారం భారతదేశం, అమెరికా, స్పెయిన్ దేశాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు పైపైకి పెరుగుతున్నాయి. వేసవి కాలంలో స్పెయిన్‌లో గరిష్ట ఉష్ణోగ్రతలు 47.2 డిగ్రీ సెంటిగ్రేడ్, భారత్‌లో 45.8 డిగ్రీలకు చేరడం, అమెరికాలో 40డిగ్రీలు తరుచుగా దాటడం సర్వసాధారణమైంది. ఉష్ణోగ్రతలతో పాటు వడగాడ్పులు తోడై ప్రజాజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఆసియా దేశాల్లో వడగాడ్పులు, నీటి, తేమ సమస్యలతో రాజస్థాన్, గుజరాత్, యూపీ, దిల్లీ రాష్ట్రాల్లో గత 122 ఏండ్లలో ఎన్నడూ చూడని వడగాడ్పులను 2022, మార్చిలో చూసాం. 72 ఏళ్ళలో అత్యధికంగా 2022, ఏప్రిల్ 9న దిల్లీలో 42.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏప్రిల్-1941లో దిల్లీలో 45.6 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత రికార్డు స్థాయిలో నమోదుకాగా రాజస్థాన్‌లో గరిష్టంగా 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అమెరికాలో వడగాలులతో ఏడాది సగటున 702 మంది మరణించగా, 2004-18 మధ్య కాలంలో 10,527 మంది వేడి

గాలులకు మృతిచెందినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. 1880 నుంచి ప్రతి దశాబ్దకాలంలో భూ ఉష్ణోగ్రతలు 0.08 డిగ్రీలు పెరుగుతుండగా, గత నాలుగు దశాబ్దాల్లో సగటున 0.18 డిగ్రీలు పెరగడం ప్రమాదకర భవిష్యత్తును సూచిస్తున్నది. ప్రతి ఏట మార్చి-జూన్ వరకు ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు మానవాళిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

అతిచలి, అత్యధిక వేసవి ఉష్ణోగ్రతలు, కరువులు, కార్చిచ్చులు, తుఫాన్లు, వరదలు అసాధారణ వాతావరణ ప్రతికూల మార్పుల వల్ల జరుగుతున్నాయని నిర్ధారణ అయ్యింది. భూతాపంతో ఆర్కిటిక్, అంటార్కిటిక్ ధృవాల్లో మంచుకరగడంతో సముద్రమట్టాలు క్రమంగా పెరుగుతూ తీరప్రాంతాలను సముద్ర నీరు ముంచనుందని ఐపిసిసి నివేదిక వివరిస్తున్నది. 1990-2019 కాలంలో మానవ ప్రేరేపిత గ్రీన్ హౌజ్ వాయువుల (కార్బన్ డై ఆక్సైడ్, ఓజోన్, హైడ్రో కార్బన్లు, నైట్రోజన్ ఆక్సైడ్లు, నీటి ఆవిరి) కారణంగా ఉష్ణోగ్రతలు 45 శాతం పెరుగుతున్నాయి. వీటిలో కార్బన్ డై ఆక్సైడ్ ప్రభావంతో 36 శాతం హరిత గృహ ప్రభావం పెరిగిందని తెలుస్తున్నది. హరిత గృహ వాయువులు పెరగడంతో ఉష్ణోగ్రతలు అధికం కావడంతోపాటు వాతావరణం, నేల, సముద్ర జలాలు ప్రతికూల మార్పులకు లోనవుతున్నాయి. 2030 నాటికి భూతాపంతో మొక్కజొన్న లాంటి ధాన్య దిగుబడులు 24శాతం తగ్గే అవకాశం ఉందని అంచనా. ఆఫ్రికాలోని సొమాలియా, ఇథియోపియా లాంటి దేశాల్లో అత్యంత పొడి గాలులతో అసాధారణ వాతావరణం నెలకొంటున్నట్లు తేలింది.

ఐపిసిసి హెచ్చరిక ప్రకారం శిలాజ ఇంధనాల విచక్షణా రహిత వినియోగం, మానవ ప్రమేయ పర్యావరణ కాలుష్యాలతో వాతావరణ ప్రతికూల మార్పులతో తీవ్ర వడగాలులు వీస్తున్నాయి. స్విట్జర్లాండ్ లోని పిజోల్ మంచుకొండలు హరితగృహ వాయువులతో 2006 నుంచి ఇప్పటివరకు 80 శాతం కరిగాయని, రానున్న దశాబ్దాల్లో 90 శాతంవరకు కరిగిపోవడంతో 2100వరకు సముద్రమట్టం 2 మీటర్లు పెరిగి 63కోట్ల ప్రజలు తమనేలను కోల్పోయే ప్రమాదం ఏర్పడనుంది. ప్రపంచదేశాలు గ్రీన్‌హౌజ్ వాయువులను నియంత్రించకపోతే ప్రపంచ మానవ మనుగడ ప్రశ్నార్థకం కానుందని ఐపిసిసి హెచ్చరిస్తున్నది. భూతాపం ఇలాగే పెరిగితే రానున్న దశాబ్దాల్లో మానవ ఆవాసాలు, గ్రామాలు, వ్యవసాయ క్షేత్రాలు, నగరాలు సముద్ర జలాలతో నిండనున్నాయని, నైజీరియా లాంటి కొన్ని దేశాలు తమ తీరప్రాంత రాజధానులను కోల్పోనున్నా యని తెలుస్తున్నది. ప్రపంచ కార్బన్ ఉద్గారాల్లో 30 శాతం చైనా బొగ్గు ఆధార పవర్ కేంద్రాలు కలిగిస్తున్నాయి. 2060 నాటికి జీరో-కార్బన్ ఉద్గారాల దేశంగా చైనా, 2070నాటికి ఇండియాలు మారుస్తామని ప్రకటించాయి.

పారిస్ అగ్రిమెంట్ సిఫార్సు ప్రకారం 2050 నాటికి కర్బన ఉద్గారాలను తగ్గించాలని, లేనియెడల ప్రస్తుత కార్బన్ ఉద్గార రేటు ఇలాగే కొనసాగితే 2100 నాటికి ఉష్ణోగ్రతలు 3-4 డిగ్రీలు పెరుగుతాయని సూచిస్తున్నారు.

డా. బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037

ఆ 16 మందిపై అనర్హత వేటు పడేది

ఎంవీఏ వేగంగా అడుగులు వేసి ఉంటే...

ఎన్‌సీపీ నాయకుడు అజిత్ పవార్

పూణే : మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా నానా పటోలే రాజీనామా చేసిన తర్వాత మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) వేగంగా ముందుకు సాగి ఉంటే, అవిభక్త శివసేనలో గత ఏడాది జరిగిన తిరుగుబాటు తర్వాత 16 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడిన విషయాన్ని సమర్థవంతంగా పరిష్కారమయ్యేదని ఎన్‌సీపీ సీనియర్ నేత అజిత్ పవార్ శుక్రవారం అన్నారు. ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని ఎంవీఏ ప్రభుత్వం కూలిపోవడానికి దారితీసిన రాజకీయ సంక్షోభంపై సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిన ఒక రోజు తర్వాత పవార్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ మాజీ ప్రధాని అతల్ బిహారీ వాజ్‌పేయికి, ప్రస్తుతం ఉన్న వారికి మధ్య చాలా వ్యత్యాసం ఉన్నందున సీఎం షిండే, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ రాజీనామా చేయాలని థాకరే చేసిన డిమాండ్ ఫలించలేదని ఆయన అన్నారు. ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటు చేసి బీజేపీతో పొత్తు పెట్టుకుని ముఖ్యమంత్రి అయ్యారు. 'మొదట, అప్పటి అసెంబ్లీ స్పీకర్ (పటోలే), అప్పటి ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరేని సంప్రదించకుండానే రాజీనామా చేశారు. రాజీనామా చేసిన తర్వాతే ప్రకటించారు. ఇది మొదట జరగకూడదు. కానీ జరిగింది' అని పవార్ అన్నారు. పటోల్ రాజీనామా తర్వాత (ఫిబ్రవరి 2021లో), ఎన్‌సీపీ, కాంగ్రెస్, అవిభక్త సేన భాగస్వాములుగా ఉన్న ఎంవీఏ స్పీకర్ నియామకం చేపట్టాల్సిందని తెలిపారు. 'కానీ దురదృష్టవశాత్తు, ఎంవీఏగా మేము దానిని చేయడంలో విఫలమయ్యాము' అని ఎంవీఏ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పని చేసిన పవార్ అన్నారు. షిండే వర్గం తిరుగుబాటు కారణంగా తలెత్తిన అనర్హత సమస్య స్పీకర్ ఉండి ఉంటే పరిష్కారమయ్యేదని ఆయన తెలిపారు. అయితే చాలా కాలంగా డిప్యూటీ స్పీకర్ సభా కార్యక్రమాలను చూస్తున్నారని, ప్రస్తుతం అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్న పవార్ అన్నారు. 'ఈ సంఘటన (తిరుగుబాటు, కొత్త ప్రభుత్వం ఏర్పాటు) తర్వాత, వారు వెంటనే ఆ పదవిని భర్తీ చేశారు. ఇప్పటికే ఆ పదవిని భర్తీ చేసి ఉంటే, స్పీకర్ ఈ 16 మంది (ఎమ్మెల్యేలు)పై అనర్హత వేటు వేసి ఉండేవారు' అని తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు తర్వాత నైతిక కారణాలతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని థాకరే చేసిన డిమాండ్‌పై పవార్ మాట్లాడుతూ దాని వల్ల ప్రయోజనం ఉండదని అన్నారు. 'మాజీ ప్రధాని అతల్ బిహారీ వాజ్‌పేయికి, ప్రస్తుతం ఉన్న వారికి తేడా ఉంది. వారు ఎప్పటికీ రాజీనామా చేయరు. కలలో కూడా రాజీనామా చేయరు' అని అన్నారు.

గత ఏడాది జూన్‌లో బలపరీక్ష ఎదుర్కోకుండానే రాజీనామా చేసినందున థాకరే నేతృత్వంలోని ఎంవీఏ ప్రభుత్వాన్ని పునరుద్ధరించలేమని సుప్రీం కోర్టు గురువారం పేర్కొంది. 16 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపై 'సహేతుకమైన వ్యవధిలో' నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను కోరింది. అసెంబ్లీలో శివసేన విప్‌గా షిండే వర్గానికి చెందిన భరత్ గోగావాలేను నియమిస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయం చట్ట విరుద్ధమని కోర్టు పేర్కొంది. అప్పటి గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీ పాత్రను కూడా తప్పుబట్టింది.

'ఈ-ఫైలింగ్ 2.0' ను ప్రారంభించిన సీజేఐ

న్యూఢిల్లీ: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డి.వై.చంద్రచూడ్ శుక్రవారం 'ఈ-ఫైలింగ్ 2.0'ను ప్రారంభించారు. ఎలక్ట్రానిక్ పద్ధతిలో కేసులు దాఖలు చేసే సదుపాయం ఇప్పుడు 24 గంటలూ అందుబాటులో ఉంటుందని న్యాయవాదులకు తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ-కోర్టులు, ఈ-ఫైలింగ్ కేసుల కోసం వాదిస్తున్న ప్రధాన న్యాయమూర్తి సుప్రీంకోర్టు ఆవరణలో 'ఈ-సేవా కేంద్రాన్ని' కూడా ప్రారంభించారు. 'మేము ఇప్పుడు ఈ ఉదయం 'ఈ-ఫైలింగ్ 2.0' ని ఆవిష్కరించాము. ఈ సౌకర్యాలు అన్ని న్యాయవాదులకు 24 గంటలూ అందుబాటులో ఉంటాయి. ఈ సౌకర్యాలు లేని న్యాయవాదులకు సహాయం చేయడానికి సాంకేతికతతో రెండు కేంద్రాలను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. 'ఈ-ఫైలింగ్ 2.0' ని ఉపయోగించాలని నేను న్యాయవాదులందరినీ అభ్యర్థిస్తున్నాను' అని శుక్రవారం విచారణ ప్రారంభంలో సీజేఐ చెప్పారు. న్యాయస్థానానికి హాజరయిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఇతర న్యాయవాదులు ఈ చర్యను అభినందించారు. ఈ-ఫైలింగ్ నమూనా ద్వారా అత్యున్నత న్యాయస్థానం, అనేక ఇతర కోర్టులలో కేసులు దాఖలవుతున్నాయి.

జనాభా పెంపుపై సిక్కిం సర్కారు దృష్టి

గ్యాంగ్‌టక్: జనాభా పెరుగుదలపై సిక్కిం ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. అందులో భాగంగా ఇద్దరు లేదా ముగ్గురు పిల్లల గల ఉద్యోగులకు అదనపు ఇంక్రిమెంట్లు అందజేయాలని నిర్ణయించింది. ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి దీనిని అమలు చేయనున్నట్లు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇద్దరు పిల్లలు గల ఉద్యోగులకు ఒక అడ్వాన్స్ ఇంక్రిమెంట్, ముగ్గురు పిల్లలు గల ఉద్యోగికి ఒక అదనపు ఇంక్రిమెంటు ఇవ్వనున్నట్లు సిబ్బంది వ్యవహారాల శాఖ కార్యదర్శి రింజింగ్ చెవాంగ్ భూటియా చెప్పారు. 2023 జనవరి ఒకటి నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తామని, ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ తర్వాత రెండు, మూడో సంతానం పుడితేనే ఈ పథకానికి అర్హులని వెల్లడించారు. దత్తత తీసుకున్నవారికి ఈ పథకం వర్తించదని భూటియా స్పష్టంచేశారు. స్థానిక స్వదేశీ ప్రజల్లో తక్కువ సంతానోత్పత్తి జరుగుతున్నందున... ఈ సమస్యను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటామని సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్‌సింగ్ తమాంగ్ ఇప్పటికే హామీ ఇచ్చారు. ఈ హామీ అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ మేరకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తున్నారు.

ఒంటరిగానే పోటీ చేస్తాం: బీజేడీ

భువనేశ్వర్: కాంగ్రెస్, బీజేపీకి సమదూరం పాటిస్తామని, తమకు ఏ పార్టీతోనూ, కూటమితోనూ పొత్తు ఉండబోదని ఒడిశాలోని అధికార బీజేడీ స్పష్టంచేసింది. బీజేడీ అధ్యక్షుడు, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆకాంక్ష మేరకు తమ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని బీజేడీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. ఒడిశా ప్రయోజనాల పరిరక్షణ, రాష్ట్ర అభివృద్ధి తమ పార్టీ ఏకైక అజెండా అని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్‌కు సమదూరంలో ఉండటమే కాకుండా ప్రతిపాదిత మూడో ఫ్రంట్ లేదా యునైటెడ్ ఫ్రంట్‌కు తాము దూరమేనని బీజేడీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీటీఐకి చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేడీ ఒంటరిగా పోటీ చేయాలని నవీన్ పట్నాయక్ కోరుకుంటున్నారని, 2009లో బీజేపీతో తెగతెంపులు చేసుకున్నప్పటి నుంచి తాము ఒంటరిగానే ఉంటున్నామని వివరించారు. 4.5 కోట్ల రాష్ట్ర ప్రజల మద్దతే తమకు ముఖ్యమన్నారు. ప్రతిపాదిత థర్డ్‌ఫ్రంట్‌లో తమ పాత్ర ఏమీ ఉండదని నవీన్ పట్నాయక్ స్పష్టంచేశారన్నారు. విపక్షాల ఐక్యతలో భాగంగా బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ఇటీవల నవీన్ పట్నాయక్‌తో సమావేశమయ్యారు. వ్యక్తిగతంగా తామిద్దరం మంచి మిత్రులమని, అందుకే కలిశామని ఇద్దరూ చెప్పారు. పట్నాయక్‌తో నితీశ్ భేటీని విలేకరులు ప్రస్తావించగా మిత్రుత్వం వేరు...రాజకీయం వేరని బీజేడీ నాయకుడు చెప్పారు.

విద్యార్థుల మార్గదర్శకులు గురువులు

ప్రధాని నరేంద్రమోదీ

గాంధీనగర్: విద్యార్థులు ఇప్పటి వరకు పుస్తక పరిజ్ఞానానికే పరిమితమయ్యారని, ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యావిధానం(ఎన్‌ఈపీ)దానిని మారుస్తుందని ప్రధాని నరేంద్రమోదీ చెప్పుకొచ్చారు. ఆల్ ఇండియా ప్రైమరీ టీచర్స్ ఫెడరేషన్ శుక్రవారం నిర్వహించిన 29వ ద్వైవార్షిక విద్యాసదస్సులో ప్రధాని మోదీ ప్రసంగించారు. సదస్సుకు దేశంలోని అనేక ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు తరలివచ్చారు. గూగుల్ అనేది డేటా, సమాచారం ఇస్తుందని, కానీ ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకుల పాత్ర పోషించాలని మోదీ చెప్పారు. 'గతంలో విద్యార్థులకు మనం పుస్తక జ్ఞానం మాత్రమే అందజేశాం. నూతన విద్యావిధానం ప్రవేశంతో ఇది మారుతుంది' అని ప్రధాని తెలిపారు. నూతన విద్యావిధానం ఆచరణాత్మక బోధనపై దృష్టి పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం సరికొత్త విద్యావ్యవస్థను తీసుకొచ్చిందని, దీనిని క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. నూతన విద్యావిధానంలో తీసుకొచ్చిన మార్పులను వివరిస్తూ విద్యార్థులకు ప్రాథమిక విద్యను మాతృభాషలోనే అందించాల్సిన అవసరం ఉందన్నారు. అలాంటి అవకాశం ఎన్‌ఈపీలో కల్పించామని తెలిపారు. స్థానిక భాషల్లో విద్యాబోధన చేయడం వల్ల గ్రామస్థాయి నుంచి వచ్చిన నైపుణ్యత గల యువత ఉపాధ్యాయులుగా మారడానికి దోహదపడుతుందని మోదీ పేర్కొన్నారు. 'స్వాతంత్ర్యం తర్వాత భారతదేశంలో ఆంగ్లభాష ఆధిపత్యం పెరిగింది. నేటికీ ఇంగ్లీషు మీడియంలో చదివించడానికే విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా గ్రామాల నుంచి వచ్చిన నైపుణ్యం గల ఉపాధ్యాయులు, నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన వారు అవకాశాలు పొందలేకపోతున్నారు. ఎందుకంటే నిరుపేదలకు ఆంగ్లం నేర్చుకునే అవకాశం లేకపోవడమే. అందుకే జాతీయ విద్యావిధానం స్థానిక భాషలో విద్యను ప్రోత్సహిస్తోంది. దీనివల్ల గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు ఉపయోగపడుతుంది' అని ప్రధాని వివరించారు.

చత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్: మావోయిస్టు మృతి

సుక్మా: చత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో శుక్రవారం పోలీసులు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఒక మావోయిస్టు మృతి చెందగా, అనేక మందికి గాయాలయ్యాయని సమాచారం. మావోయిస్టు మృతిని పోలీసులు ధ్రువీకరించారు. సుక్మా జిల్లా సిరిసిట్టి కోడెల్‌పర అడవుల్లో పోలీసులు, మావోయిస్టులకు మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయి. ఘటనా స్థలం నుంచి భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అటవీ ప్రాంతంలో ప్రస్తుతం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. మావోయిస్టుల ఆచూకీ గురించి పక్కా సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీలు చేపట్టిన క్రమంలోనే కాల్పులు చోటు చేసుకున్నట్లు తెలిసింది.

సిసోడియా కస్టడీ 2 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ: సీబీఐ కేసులో ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు జూన్ 2 వరకు పొడిగించింది. అంతకు ముందు సిసోడియా బెయిల్ పిటిషన్‌పై తీర్పును కోర్టు రిజర్వ్ చేసింది. బెయిల్ పిటిషన్‌పై ఆదేశాలు ఇచ్చే వరకు సిసోడియా మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య తన భార్యతో వర్చువల్ విధానంలో మాట్లాడేందుకు అనుమతించాలని జైలు సూపరింటెండెంట్‌ని ఆదేశించారు. సిసోడియా ప్రస్తుతం సీబీఐ, ఈడీ నమోదు చేసిన కేసుల్లో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈడీ కేసులో కూడా ఆయనకు కోర్టు బెయిల్ నిరాకరించింది. సిసోడియా భార్య మల్టిపుల్ స్క్లీరోసిస్‌తో బాధపడుతున్నారు.

ఇంట్లో ఆమె ఒంటరిగా ఉంటున్నారు. అయితే, ఒంటరిగా ఉండడంతో ఒత్తిడికి గురవుతున్నారని, మల్టిపుల్ స్క్లీరోసిస్ వ్యాధితో బాధపడే రోగికి శరీరంపై మెదడు నియంత్రణ తగ్గిపోతుందని ఆమెకు చికిత్స అందిస్తున్న అపోలో వైద్యులు తెలిపారు. వ్యాధి కారణంగా రోజువారీ పనులు చేసుకోవడం కూడా కష్టంగా ఉంటుందని. నడవడానికి, కూర్చోవడానికి కూడా ఇబ్బందిపడతారని వైద్యులు వివరించారు.

'ది కేరళ స్టోరీ' మీ వైఖరి తెలపండి

బెంగాల్, తమిళనాడు ప్రభుత్వాలకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: ది కేరళ స్టోరీ సినిమాను ఎందుకు నిషేధించారో సమాధానం చెప్పాలని పశ్చిమబెంగాల్, తమిళనాడు ప్రభుత్వాలను సుప్రీంకోర్టు శుక్రవారం ప్రశ్నించింది. ఆ రెండు రాష్ట్రాల్లో సినిమాను నిషేధించడాన్ని సవాల్ చేస్తూ నిర్మాతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహతో కూడిన ధర్మాసనం ఈ మేరకు బెంగాల్, తమిళనాడుకు నోటీసులు జారీ చేసింది. ఎలాంటి సమస్య లేకుండా దేశమంతా సినిమా ప్రదర్శిస్తుంటే అక్కడ ఎందుకు అడ్డుకుంటున్నారని బెంగాల్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ది కేరళ స్టోరీపై నిషేధం విధించడానికి సరైన కారణం కనిపించడం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'దేశంలోని అన్ని ప్రాంతాల్లో సినిమా ప్రదర్శిస్తున్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది రాలేదు. ఒకవేళ ఈ సినిమా వద్దనుకుంటే ప్రజలు చూడటం మానేస్తారు. దీనికి నిషేధం ఎందుకు' అని ప్రశ్నించింది. బెంగాల్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు వినిపించారు. ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు ఈ సినిమా ప్రదర్శించడం వల్ల శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమవుతుందని, భిన్నవర్గాల మధ్య ప్రశాంతత దెబ్బతింటుందని వివరించారు. ది కేరళ స్టోరీ ప్రదర్శిస్తున్న థియేటర్ల వద్ద అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవచ్చు గదా అని తమిళనాడు ప్రభుత్వానికి ధర్మాసనం సూచించింది. వాస్తవంగా తాము సినిమాపై నిషేధం విధించలేదని తమిళనాడు ప్రభుత్వం తరపు న్యాయవాది అమిత్ ఆనంద్ తివారీ చెప్పారు. నిర్మాతల తరపు న్యాయవాది హరీశ్ సాల్వే జోక్యం చేసుకుంటూ తమిళనాడులో అధికారికంగా సినిమాపై నిషేధం విధించలేదని, అయితే, సినిమా ప్రదర్శించే థియేటర్ల యజమానులను బెదిరిస్తున్నారని తెలిపారు. దీంతో థియేటర్లు సినిమా ప్రదర్శనకు ముందుకు రావడం లేదని చెప్పారు. బుధవారం నాటికి సమాధానం చెప్పాలని రెండు రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీం ఆదేశించింది.

పైలట్ యాత్రను గమనిస్తున్నాం

కాంగ్రెస్ నేత రాంధావా వెల్లడి

న్యూఢిల్లీ: జనసంఘర్ష యాత్ర సచిన్ పైలట్ వ్యక్తిగతమని, పైలట్ యాత్రను పార్టీ నిశితంగా గమనిస్తోందని కాంగ్రెస్ పార్టీ రాజస్తాన్ ఇన్‌చార్జి సుఖ్జిందర్‌సింగ్ రాంధావా శుక్రవారం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కర్నాటక నుంచి తిరిగి వచ్చిన తర్వాత అన్ని అంశాలపై చర్చిస్తామని ఆయన తెలిపారు. రాజస్తాన్ పీసీసీ అధ్యక్షుడు గోవింద్ సింగ్ దొతస్రా, సహ ఇన్‌చార్జిలు ఖాజీ మహమ్మద్ నిజాముద్దీన్, అమృత ధావన్, వీరేంద్ర రాథోడ్ తదితర సీనియర్ నాయకులతో చర్చించిన తర్వాత రాంధ్వా ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత అంశాలు, రానున్న అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లపై చర్చించినట్లు ఆయన వెల్లడించారు. కర్నాటక ఎన్నికలు, ఉప ఎన్నికల వల్ల తామంతా హడావుడిగా ఉన్నామని, అందువల్ల తాజాగా తామంతా ఇప్పుడు మొదటిసారి సమావేశమయ్యామని విలేకరులకు చెప్పారు. పైలట్ యాత్ర గురించి అడుగగా ఇది కచ్చితంగా వ్యక్తిగత యాత్ర, పైలట్ తనకు తాను సొంతగా పాదయాత్ర చేస్తున్నారు. దీనిని తాము నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు. ఖర్గే కర్నాటక నుంచి తిరిగి వచ్చిన తర్వాత అన్ని అంశాలపై చర్చిస్తామని రాంధ్వా చెప్పారు. పైలట్‌పై చర్య తీసుకుంటారా అని ప్రశ్నించగా ఆయన యాత్రను నిశితంగా పరిశీలిస్తున్నామని ఒక్క వాక్యంలో తాను చెప్పానని, తన అభిప్రాయాలను కాంగ్రెస్ అధ్యక్షుడికి చెబుతానన్నారు.

141 సీట్లు గెలుస్తాం: శివకుమార్

బెంగళూరు: ఎగ్జిట్ పోల్ అంచనాలను కాంగ్రెస్ పార్టీ కర్నాటక రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్ శుక్రవారం కొట్టిపారేశారు. కాంగ్రెస్ 141 సీట్లు గెలుచుకుంటుందని, రాష్ట్రంలో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తీరతామని ధీమాగా చెప్పారు. హంగ్ అసెంబ్లీ అనే ప్రశ్నేలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూల గాలి వీచిందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఒకరోజు ముందు ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. రిసార్టు రాజకీయాలకు కాలం చెల్లిందని వ్యాఖ్యానించారు. 'ఎగ్జిట్‌పోల్స్‌ను నేను నమ్మడం లేదు. మాకు 141 సీట్లు వస్తాయని విశ్వసిస్తున్నాను. మా సర్వే అంచనాలు కచ్చితమైనవి. ఎగ్జిట్‌పోల్ శాంపిల్ సైజు చాలా చిన్నది. రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్‌కు అనుకూలంగా మారారు' అని శివకుమార్ చెప్పారు. ఎగ్జిట్ పోల్ ఫలితాలు 20 సీట్లు అటూఇటుగా ఉన్నాయన్నారు. ఆ 20 సీట్లకు ఒకటి అదనంగానే తాము గెలుస్తాం కానీ ఒక్క సీటు కూడా తక్కువ రాదన్నారు. తమకు అనుకూలంగా వచ్చిన ఎగ్జిట్ పోల్స్ అంచనాలను వివాదాస్పదం చేయాలని తాను కోరుకోవడం లేదని, అయితే తాము స్పష్టమైన మెజారిటీ సాధిస్తామని నమ్ముతున్నట్లు చెప్పారు.

తాము క్షేత్రస్థాయిలో పనిచేశామని, కచ్చితమైన అంచనాతోనే చెబుతున్నానన్నారు. బీజేపీ పెద్దఎత్తున డబ్బు ఖర్చు పెట్టినా...బడా నాయకులు ప్రచారం చేసినా కాంగ్రెస్‌కు అనుకూలంగా తీర్పు వెలువడుతుందని శివకుమార్ వివరించారు. హంగ్ అసెంబ్లీ అవకాశాలను సైతం ఆయన తోసిపుచ్చారు. ఓటర్లకు డబ్బుకు లొంగలేదని, బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వ ప్రచారాన్ని విశ్వసించలేదన్నారు. అందువల్ల హంగ్ అసెంబ్లీకి అవకాశం లేదన్నారు. సంకీర్ణ ప్రభుత్వానికి తాము సిద్ధమేనని జేడీఎస్ నేత కుమారస్వామి ప్రకటించడంపై స్పందిస్తూ కుమారస్వామి ఏమి చెబుతున్నారో ఆయనకే తెలియడం లేదన్నారు. రాజకీయ జీవితాన్ని వృథా చేసుకోవద్దని, కాంగ్రెస్‌లో చేరాలని జేడీఎస్ నాయకులు, కార్యకర్తలకు శివకుమార్ పిలుపునిచ్చారు.

అధికారి ఇంట్లో విస్తుపోయే ఆస్తులు

భోపాల్: మధ్యప్రదేశ్‌లో అవినీతి నిరోధక అధికారులు ఒక ప్రభుత్వ అధికారి అవినీతి బాగోతాన్ని బట్టబయలు చేశారు. ప్రభుత్వ శాఖలో చిరుద్యోగిగా చేరిన ఆమె పదేళ్ల కాలంలోనే కోట్లకు పడగలెత్తారు. ఆమె ఇంట్లో ఉన్న 20 వాహనాలలో 10 వరకు లగ్జరీ కార్లు ఉన్నాయి. ఆ ఇంట్లో ఉన్న ఖరీదైన వస్తువులు, వంద శునకాలను చూసి అధికారులు అవాక్కయ్యారు. భోపాల్‌కు చెందిన హేమా మీనా 2011లో ఒప్పంద ప్రాతిపదికన మధ్యప్రదేశ్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ విభాగంలో చేరారు. ప్రస్తుతం ఆమె ఇన్‌ఛార్జ్ అసిస్టెంట్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. నెలకు రూ.30వేల జీతం తీసుకునే ఆమె ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారని అవినీతి నిరోధక శాఖ అధికారులకు 2020లో ఫిర్యాదు అందింది. దీంతో దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోనే లోకాయుక్త స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగానికి చెందిన బృందం గురువారం సాధారణ దుస్తుల్లో మీనా ఇంటికి వెళ్లింది. వాచ్‌మెన్ వారిని అడ్డుకోగా సోలార్ ప్యానెల్స్ రిపేర్ చేసేందుకు వచ్చామని చెప్పి లోపలికి వెళ్లారు. ఇంట్లోకి వెళ్లగానే మీనాను తమ కస్టడీలోకి తీసుకుని తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో కళ్లు చెదిరే సంపద బయటపడింది. అధికారులు ఒక్క రోజు చేసిన తనిఖీల్లోనే రూ.7కోట్ల విలువైన ఆస్తుల వివరాలు బయటపడ్డాయి. మీనాకు వచ్చే అన్ని రకాల ఆదాయం కంటే ఇది 232శాతం అధికం కావడం గమనార్హం. ఆమె తొలుత 20వేల చదరపు అడుగుల వ్యవసాయ భూమిని ఆమె తండ్రి పేరు మీద కొనుగోలు చేసినట్లు ఈ తనిఖీల్లో బయటపడింది. ఆ తర్వాత ఆ స్థలంలో రూ.కోటితో విలాసవంతమైన భవనాన్ని నిర్మించినట్లు అధికారులు తెలిపారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చేపట్టే ప్రాజెక్టుల కోసం తీసుకొచ్చిన నిర్మాణ మెటీరియల్‌ను కూడా మీనా తన ఇంటి నిర్మాణం కోసం వినియోగించారని అధికారులు తెలిపారు. ఇక ఆమె ఇంట్లో 20 వాహనాలుండగా.. అందులో ఐదు నుంచి ఏడు విలాసవంతమైన కార్లు ఉన్నాయి. రూ.30లక్షల విలువ చేసే 98 అంగుళాల అత్యాధునిక టీవీ సెట్, పూర్తి వైర్‌లెస్ కమ్యూనికేషన్ సిస్టమ్, మొబైల్ జామర్స్ వంటి వస్తువులున్నాయని అధికారులు తెలిపారు. ఆమె ఇంట్లో వంద పెంపుడు కుక్కలు, 20కి పైగా మేలు జాతి పశువులు, భారీ వ్యవసాయ యంత్రాలు, హార్వెస్టర్లు వంటి వాటిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శునకాలకు రోటీలు తయారు చేసేందుకు ఏకంగా రోటీ మిషనే ఉంది. పోలీసు హౌసింగ్ బోర్డుకు చెందిన లక్షల విలువ చేసే పరికరాలు ఆమె ఇంట్లో చూసి అధికారులు కంగుతిన్నారు. భోపాల్‌లోని బిలిరియాలో మీనా ఇంటితో పాటు రైసెన్, విదిశ జిల్లాల్లోనూ ఆమెకు వ్యవసాయ భూములు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆమె ఆస్తులపై మరిన్ని తనిఖీలు చేయనున్నట్లు వెల్లడించారు.

లైంగిక వేధింపుల నివారణ కమిటీల ఏర్పాటుపై దృష్టి పెట్టాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: లైంగిక వేధింపులను అరికట్టేందుకు సముచిత కమిటీలను అన్ని మంత్రిత్వశాఖలు, విభాగాలు, సంస్థల్లో ఏర్పాటు చేయడంపై పూరిగా దృష్టిని కేంద్రీకరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. కమిటీల నిర్వహణను నిర్ధారించే ప్రక్రియకు కాలపరిమితిని నిర్దేశించాలని సూచించింది. లైంగిక వేధింపుల నివారణ చట్టం (పీఓఎస్‌హెచ్) 2013 అమలు సక్రమంగా జరగడం లేదని పేర్కొంది. సరైన కమిటీలు లేకపోతే విచారణలు సక్రమంగా జరిగవని, చిన్న తప్పుకు ఉద్యోగులకు పెద్ద శిక్ష/జరిమానా పడే అవకాశం ఉంటుందని జస్టిస్ ఏఎస్ బొప్పన్న, జస్టిస్ హిమాకోహ్లితో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. ఈ చట్టంలోని అన్ని నిబంధనల అమలు కచ్చితంగా పాటించేలా కమిటీలు ఉండాలని కోర్టు తెలిపింది. అన్ని శాఖలు, విభాగాలు, ప్రభుత్వ వ్యవస్థలు, సంఘాల్లో ఐసీసీలు/ఎల్‌సీలు/ఐసీలు పీఓఎస్‌హెచ్ చట్టానికి లోబడి ఉండేలా చూసుకోవా లని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధర్మాసనం సూచించింది. కమిటీల ఏర్పాటుకు అవసరమైన సమాచారం, సంబంధిత వ్యక్తుల ఈ-మెయిల్ ఐడీలు, ఫోన్ నంబర్లు, ఆన్‌లైన్‌లో ఫిర్యాదు ప్రక్రియ, నియమ, నిబంధనలు, అంతర్గత విధానాలు వంటివన్నీ అధికారిక వెబ్‌సైట్‌లలో పొందుపర్చాలని, ముఖ్యమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని పేర్కొంది. తనపై లైంగిక వేధింపుల ఆరోపణల మీద బాంబే హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ గోవా యూనివర్సిటీకి చెందిన మాజీ విభాగాధిపతి ఫెర్నాండెజ్ ఫిర్యాదును పరిశీలిం చిన న్యాయస్థానం తాజా ఉత్తర్వులు ఇచ్చింది. దర్యాప్తు కార్యకలాపాల్లో లోటుపాట్లు, సహజ న్యాయ సిద్ధాంతాల ఉల్లంఘనల దృష్ట్యా హైకోర్టు తీర్పును రద్దుచేసింది. అదే విధంగా వైద్యులు, న్యాయవాదులు, ఆర్కిటెక్టులు, సీఏలు, కాస్ట్ అకౌంటెంట్లు, ఇంజినీర్లు, బ్యాంకర్లు తదితర వృత్తిదారులు... యూనివర్సిటీలు, కాలేజీలు, శిక్షణ కేంద్రాలు, విద్యా వ్యవస్థలు, ప్రభుత్వ-ప్రైవేటు ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలకూ ఇదే తరహా ఆదేశాలను న్యాయస్థానం జారీచేసింది. స్థానిక కమిటీలు, అంతర్గత కమిటీల ఏర్పాటునకు తక్షణ, సమర్థ చర్యలు తీసుకోవాలని అన్ని యంత్రాంగాలకు సూచించింది. ప్రజల్లో, యువతకు అవగాహన కల్పించేందుకు వర్క్‌షాపులు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జాతీయ న్యాయ సేవల యంత్రాంగం (ఎన్‌ఏఎల్‌ఎస్‌ఏ), రాష్ట్ర న్యాయ సేవల యంత్రాంగాలు (ఎస్‌ఎల్‌ఎస్‌ఏలు)కు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలిచ్చింది.

పరమ్‌వీర్ సింగ్‌పై కేసులు ఎత్తివేత

మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం



ముంబై: మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మాజీ పోలీస్ చీఫ్ పరమ్‌వీర్ సింగ్‌పై ఉన్న అన్ని కేసులను ఎత్తివేసింది. అలాగే 2021 డిసెంబర్‌లో జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వులనూ రద్దు చేసింది. ఆ కాలంలో కూడా ఆయన విధుల్లో ఉన్నట్లు పరిగణిస్తామని తెలిపింది. బీజేపీ నేత, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఈ విషయంపై మాట్లాడారు. పరమ్‌వీర్ సింగ్‌పై శాఖాపరమైన విచారణను సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్) తప్పుపట్టిందనీ, ఆ విచారణను మూసివేయాలని ఆదేశించిందన్నారు. డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీ వల్ల ఆయన సస్పెండ్ అయ్యారని, అయితే అది తప్పని ఇప్పుడు రుజువైందని చెప్పారు. ఈ నేపథ్యంలో పరమ్ వీర్ సింగ్ సస్పెన్షన్ రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. కాగా, 2021 ఫిబ్రవరి 25న ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేష్ అంబానీకి చెందిన ముంబై నివాసం సమీపంలో బాంబులతో కూడిన వాహనం నిలిచి ఉండటం కలకలం రేపింది. ఈ కేసులో పోలీసు అధికారి సచిన్ వాజ్‌ను అరెస్టు చేశారు. నాడు ముంబై పోలీస్ చీఫ్‌గా ఉన్న పరమ్‌వీర్ సింగ్‌ను ఆ పోస్ట్ నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో ముంబైలోని హోటళ్లు, బార్‌ల నుంచి ప్రతి నెలా రూ.వంద కోట్లు వసూలు చేయాలని పోలీస్ అధికారి సచిన్ వాజ్‌ను అప్పటి హోం మంత్రి అనిల్ దేశ్‌ముఖ్ ఆదేశించారని పరమ్ వీర్ సింగ్ తెలిపారు. 2018 జనవరి నుంచి 2019 ఫిబ్రవరి వరకు థాణే పోలీస్ కమిషనర్‌గా ఉన్న పరమ్ వీర్ సింగ్, తప్పుడు కేసులు నమోదు చేస్తానని బెదిరించి రూ.1.25 కోట్లు వసూలు చేశారని బిల్డర్ కేతన్ తన్నా ఫిర్యాదు చేశారు. తన బార్లు, రెస్టారెంట్లలో రైడ్ చేయకుండా ఉండేందుకు పరమ్‌వీర్ సింగ్ రూ.9 లక్షలు వసూలు చేసినట్లు బిల్డర్, హోటళ్ల యజమాని బిమల్ అగర్వాల్ ఆరోపించారు. రూ.2.92 లక్షల విలువైన రెండు స్మార్ట్ ఫోన్లను బలవంతంగా తనతో కొనిపించినట్లు గోరెగావ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో 2021 జులైలో పరమ్ వీర్ సింగ్, ఆరుగురు పోలీస్ అధికారులతో సహా 28 మందిపై కేసు నమోదైంది. మహారాష్ట్రలో నాడు అధికారంలో ఉన్న మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) ప్రభుత్వం పరమ్ వీర్ సింగ్‌పై చర్యలు చేపట్టింది. క్రమశిక్షణారాహిత్యం, అక్రమాలకు పాల్పడిన ఆరోపణలపై ఆయనను సస్పెండ్ చేసింది. శాఖాపరమైన విచారణకు ఆదేశించింది.

చుక్కల భూములపై పూర్తి హక్కు

- చంద్రబాబుకి ఓటేస్తే సంక్షేమం ఆగినట్టే
- ప్యాకేజ్ స్టార్ పవన్ కల్యాణ్
- కావలి బహిరంగ సభలో జగన్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: రైతన్నలందరికీ చుక్కల భూములపై పూర్తి హక్కు కల్పించామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. దశాబ్దాలుగా రైతన్నల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న చుక్కల భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించినట్లు చెప్పారు. చుక్కల భూములపై రైతన్నకు సంపూర్ణ హక్కు కల్పించినట్లు వెల్లడించారు. శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నెల్లూరు జిల్లా కావలిలో సీఎం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడుతూ రైతన్నల కష్టం చూశానని, అందుకే ప్రతి సమస్య పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తున్నానని చెప్పారు. ఇప్పటికే గిరిజనులకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేశామన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో భూసర్వే శరవేగంగా జరుగుతోందని, ఇప్పటికే 2వేల గ్రామాల్లో భూ సర్వే పూర్తి చేశామని తెలిపారు. భూ హక్కు పత్రాలు కూడా వేగంగా ఇస్తున్నామన్నారు. ఈ నెల 20న 2వేల గ్రామాల్లో భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తామని, ఆర్బీకేల ద్వారా రైతులకు ఎన్నో సేవలు అందుబాటులోకి తెచ్చామని జగన్ తెలిపారు. దళారీ వ్యవస్థ లేకుండా రైతులకు మేలు చేశామని జగన్ చెప్పారు. రైతుల మేలు కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. నాలుగేళ్లుగా ప్రతి అడుగూ రైతన్నల కోసమే వేశామని, రైతులను చంద్రబాబు గాలికొదిలేశారన్నారు. చంద్రబాబు, దత్తపుత్రుడు రైతు బాంధవుల వేషం వేసుకొని రోడ్డెక్కారని, వారికి తోడుగా రావణ సైన్యంగా ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 నిలిచాయని విమర్శించారు. రూ.87,612 కోట్లు రైతు రుణాలు మాఫీ చేస్తానని మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని, బ్యాంకుల్లో పెట్టిన బంగారం ఇంటికి రప్పిస్తామని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. రైతులను మోసం చేసిన పెద్ద మనిషిని ఒక్క మాట అడగరు. ప్రశ్నిస్తామని చెప్పిన వారు ప్రశ్నించడమే మానేశారని అటు మీడియాను, ఇటు పవన్ కల్యాణ్‌ను దుయ్యబట్టారు. ఎన్నికలు దగ్గరపడుత ున్నందున చంద్రబాబు, ప్యాకేజీ స్టార్ రోడ్డెక్కారని జగన్ విమర్శించారు. చంద్రబాబు స్క్రిప్ట్‌ను డైలాగ్‌లుగా మార్చిన ప్యాకేజీ స్టార్ ఒక వైపు...బాబు, దత్తపుత్రుడి డ్రామాలు రక్తి కట్టించాలని ఎల్లో మీడియా మరోవైపు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. డీబీటీ ద్వారా రూ.2.10 లక్షల కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లో జమ చేశామని గుర్తుచేశారు. లంచాలు, వివక్షకు తావు లేకుండా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు.. ప్రతి పేదవాడికి తోడుగా మన ప్రభుత్వం అడుగులు వేస్తోందని వివరించారు. చంద్రబాబుకు ఓటు వేస్తే సంక్షేమ పథకాలు ఆగినట్టేనని జగన్ చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వం వస్తే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని, వీళ్ల విధానం దోచుకో,పంచుకో, తినుకో అని జగన్ మండిపడ్డారు. ఈ మధ్య ప్రముఖ ఆర్థికవేత్త పేరుతో జీవీ రావు అనే దానయ్య తెరపైకి వచ్చాడని, సంక్షేమ పథకాలు ఇస్తే రాష్ట్రం నాశనమవుతుందని దానయ్యతో చెప్పించారని జగన్ విమర్శించారు. చంద్రబాబు, ఎల్లో మీడియాది పెత్తందారీ మనస్తత్వమని, వీళ్లు చేసే ప్రతి పని, ప్రతి మాట ప్రతి రాతలోనూ మోసం ఉందన్నారు.

టీడీపీ, బీజేపీతోనే పొత్తు

మరోసారి బలిపశువును కాలేను: పవన్

విశాలాంధ్ర-విజయవాడ: సీఎం పదవి రావాలంటే సముచిత స్థానాల్లో గెలిపించాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీతో జనసేన పొత్తు ఉంటుందని స్పష్టంచేశారు. ఒంటరిగా పోటీ చేసి మరోసారి బలిపశువు కావడం తనకు ఇష్టం లేదన్నారు. అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే ప్రథమ కర్తవ్యంగా భావించాలని కోరారు. గుంటూరు జిల్లా మంగళగిరి పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జనసేన మండల, డివిజన్ అధ్యక్షుల సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. సీఎం,..సీఎం అని కేకలు వేస్తే ముఖ్యమంత్రి కాలేనని, క్రేన్లతో గజమాలలు వేసే కన్నా ఓట్లు వేస్తేనే సీఎం అవుతానని గుర్తించాలని కార్యకర్తలకు పవన్ సూచించారు. ప్రజాశక్తిని ఓట్ల కింద మార్చుకోవాలంటే తనంత బలంగా తిరగాలని, ఒక్కొక్కరు వంద ఓట్లు వేయించే సత్తా ఉండాలని ఉద్బోధించారు. తాను మానవతావాదినని, దేశభక్తుడినని చెప్పారు. ఏటా కార్యకర్తల ఆరోగ్యం కోసం కోటి రూపాయలు ఖర్చుచేస్తున్నట్లు తెలిపారు. డిసెంబరులో ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని, అందువల్ల జులై నుంచి మంగళగిరిలోనే ఉంటానని చెప్పారు. త్రిముఖ పోటీలో బలికావటానికి తాను సిద్ధంగా లేనని పవన్ స్పష్టంచేశారు. భూస్వామ్య సిద్ధాంతాలతో రాష్ట్రాన్ని వైసీపీ నలిపేస్తున్నదని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ తమ ప్రధాన ప్రత్యర్థి అని గుర్తు పెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలో గూండాయిజాన్ని పెంచి పోషిస్తోందని, రైతులను, నిరుద్యోగులను మోసం చేస్తోందని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌ను అధోగతి పాలుచేసిందని ధ్వజమెత్తారు. టీడీపీ నాయకులను ముఖ్యమంత్రి చేసేందుకు జనసేన సిద్ధంగా లేదన్నారు. జనసేనకు ఎంత బలం ఉందో బేరీజు వేసుకోవాలన్నారు. గత ఎన్నికల్లో 137 స్థానాల్లో పోటీ చేస్తే కనీసం 40 గెలిచినా సీఎం అయ్యేవాళ్లమని చెప్పారు. బేషజాలు అవసరం లేదని, వ్యూహాలు తనకు వదిలిపెట్టాలని విన్నవించారు. నాయకులు బాధ్యతగా పనిచేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా టీడీపీ, బీజేపీతో జనసేన పొత్తు ఉంటుందని తేల్చిచెప్పారు. దీనికి సంబంధించి విధివిధానాలు ఇంకా ప్రకటించలేదన్నారు. పొత్తుపై స్పష్టత వచ్చాక ప్రజల మధ్య ఒప్పందం చేసుకుంటామని చెప్పారు. ఇప్పుడున్న సీఎంను దించడమే ప్రథమ కర్తవ్యమని చెప్పారు.

అదానీ-హిండెన్‌బర్గ్ కేసు విచారణకు

సెబీకి మరో మూడు నెలల గడువు?

న్యూఢిల్లీ: అదానీ-హిండెన్‌బర్గ్ వివాదంపై విచారణకు సెబీకి మరో మూడు నెలల గడువు ఇచ్చే ఉద్దేశం ఉన్నట్లు శుక్రవారం జరిగిన విచారణ సమయంలో సుప్రీంకోర్టు తెలిపింది. అదానీ-హిండెన్‌బర్గ్ వివాదానికి సంబంధించిన పిటిషన్ల విచారణను ఈనెల 15వ తేదీన చేపడతామని సీజేఐ చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ జేబీ పార్దివాలాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. సర్వోన్నత న్యాయస్థానం నియమించిన రిటైర్డ్ జడ్జి ఏఎం సప్రే నేతృత్వ కమిటీ నివేదిక కోర్టు రిజిస్ట్రీకి అందించినట్లు తెలిపింది. ప్యానల్ నివేదికలోని అంశాలను పరిశీలించి, సోమవారం విచారణ చేపడతామని వెల్లడించింది. సెబీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టులో వాదనలు వినిపించారు. స్టాక్‌మార్కెట్‌ను అదానీ గ్రూపు ప్రభావితం చేసినట్లు వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు ముగించేందుకు సెబీకి ముందు కోరినట్లు ఆరు నెలలకు బదులు మూడు నెలల గడువు ఇవ్వాలని కోరారు. వాదనల సమయంలో పిటిషనర్ జయా ఠాకూర్ తరఫు న్యాయవాదిని కోర్టు మందలించింది. రెగ్యులేటరీ వైఫల్యంలో సెబీ పాత్రపై కోర్టు ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని తేల్చిచెప్పింది.

జస్టిస్ మహేశ్వరిది ఉన్నత వ్యక్తిత్వం

వీడ్కోలు సభలో సీజేఐ చంద్రచూడ్ ప్రశంస

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో నాలుగేళ్లకుపైగా న్యాయమూర్తిగా పనిచేసి ఈనెల 14న పదవీ విరమణ పొందుతున్న జస్టిస్ దినేశ్ మహేశ్వరిది ఉన్నతమైన వ్యక్తిత్వమని, ఆయన శాంతమూర్తి అని సీజేఐ డీవై చంద్రచూడ్ ప్రశంసించారు. జస్టిస్ మహేశ్వరి వీడ్కోలు సభలో సీజేఐ మాట్లాడుతూ అలహాబాద్ హైకోర్టులో జస్టిస్ మహేశ్వరితో కలిసి పనిచేసినట్లు చెప్పారు. ఆయన తనకు సీనియర్ అని అన్నారు. జస్టిస్ మహేశ్వరి 'జెంటిల్‌మెన్ జడ్జి, ఫ్రెండ్లీ జడ్జి', ఆయనకు కోపమంటే ఏమిటో తెలియదని, చివరిగా ఎప్పుడు కోపడ్డారో బహుశ జస్టిస్ మహేశ్వరికీ గుర్తుండకపోవచ్చ'ని అన్నారు. తన తరఫునే కాకుండా సుప్రీంకోర్టు న్యాయ మూర్తులు, సిబ్బంది, బార్ సభ్యులందరి తరఫున జస్టిస్ మహేశ్వరికి శుభాభినందనలు తెలిపారు. భవిష్యత్ అద్భుతంగా సాగాలని, ఆయన మంచి పనిచేయడాన్ని కొనసాగించాలని సీజేఐ ఆకాంక్షించారు. తనకు అభినందనలు తెలిపిన జడ్జిలు, బార్ సభ్యులకు జస్టిస్ మహేశ్వరి శుభాకాంక్షలు తెలిపారు. 'విధి నిర్వహణలో నాకు సహకరించిన అందరికీ కృతజ్ఞుడను. మనం ఎప్పటికీ కలిసి పనిచేద్దాం' అంటూ భావోద్వేగానికి లోన య్యారు. సర్వోన్నత వ్యవస్థకు సేవలు అందించడం ఎంతో గర్వకారణమని, అంతా గుర్తొస్తారని, అందరినీ వదిలి వెళ్లడం బాధగా ఉందని అన్నారు. సర్వోన్నత న్యాయస్థానంలో ఆరవ సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ మహేశ్వరి పదవీ విరమణతో జడ్జిల సంఖ్య 33కు తగ్గింది. కార్యక్రమంలో బార్ నేతలు, అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి, ఎస్‌సీబీఏ అధ్యక్షుడు, సీనియర్ న్యాయ వాది వికాస్ సింగ్, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, మాజీ అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీ, సీనియర్ న్యాయవాది ఏఎం సింఘ్వీ తదితరులు పాల్గొ న్నారు. జస్టిస్ మహేశ్వరికి అభినందనలు తెలిపారు. ఆయన చివరి పనిదినం ఆదివారం కావడంతో శుక్రవారమే వీడ్కోలు సభను బార్ కౌన్సిళ్లు ఏర్పాటు చేశాయి. కాగా జస్టిస్ మహేశ్వరి 1959, మే 15న రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జన్మించారు. 1977లో రాజస్తాన్ యూనివర్సిటీ, మహారాజ కాలేజి నుంచి బీఎస్సీ (ఫిజిక్స్) చేశారు. 1980లో జోధ్‌పూర్ యూనివర్సిటీ నుంచి లా పట్టా పొందారు. 1981లో రాజస్తాన్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా చేరారు. రాజస్తాన్ హైకోర్టుతో పాటు సబార్డినేట్ కోర్టుల్లో పనిచేసిన ఆయన 2004, సెప్టెంబరు 2న హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2014, జులై 19న అలహాబాద్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2015, మార్చి నుంచి లక్నో బెంచీ సీనియర్ జడ్జిగా వ్యవహరించారు. 2016, ఫిబ్రవరి 24న మేఘాలయ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2018, ఫిబ్రవరి 12న కర్నాటక హైకోర్టు బాధ్యతలు చేపట్టారు. 2019, జనవరి 18న సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ మహేశ్వరి నియమితులయ్యారు.

రైతులకు అండగా ఉంటా: చంద్రబాబు

విశాలాంధ్ర-తణుకు : రైతులకు అండగా ఉంటానని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. రైతు పోరు బాట పేరుతో శుక్రవారం తణుకు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అధ్వర్యంలో నియోజకవర్గంలో ఆయన సుమారు 12 కి.మీలు పాదయాత్ర నిర్వహించారు. టీడీపీ శ్రేణులు, రైతులతో కలిసి ఇరగవరం నుంచి తణుకు వై జంక్షన్ వరకు ఈ పాదయాత్రను కొనసాగించారు. మార్గమధ్యలో చంద్రబాబుకు మహిళలు హారతులు పడుతూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులను రాష్ట్ర ప్రభుత్వం సర్వనాశనం చేసిందని, అనేక సమస్యలతో రైతులు రోడ్డెక్కారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ రైతులకు అండగా ఉంటుందన్నారు. కల్లాల్లోని ధాన్యం కొనుగోలు చేసే వరకు రైతుల తరపున పోరాడతానని తెలిపారు. ధాన్యం కొనుగోలు సమస్యలు పరిష్కరించాలంటూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా వై జంక్షన్ వద్ద ఉన్న ఎంబీఏ కళాశాల ఆవరణలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ జగన్ అసమర్థతతో అన్ని వ్యవస్థలు నాశనం అయ్యాయని ఆరోపించారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు అండగా నిలవడంలో సీఎం జగన్ విఫలమయ్యారని అన్నారు. వర్షాలకు తడిసి రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, తరుగు పేరుతో రైతులను దోచుకోవడం అరికట్టాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర నాయకులు ఎమ్మెల్యే దేవినేని ఉమామహేశ్వరరావు, బుచ్చయ్య చౌదరి, మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, పీతల సుజాత, జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, ఉండి మాజీ ఎమ్మెల్యే కె.శివరామరాజు, టీడీపీ తణుకు నియోజకవర్గం నాయకులు ఆరిమిల్లి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఫిల్మ్ చాంబర్ ముందు 'లైగర్' బాధితుల ధర్నా

హైదరాబాద్: రౌడీ హీరో విజయ్ దేవరకొండతో చేసిన 'లైగర్' చిత్రంతో పాన్ ఇండియా వైడ్‌గా తన సత్తా చాటాలని చూసిన పూరీ జగన్నాథ్‌కు ఆ చిత్రం.. ఇప్పటికీ ఓ పీడకలగానే మారింది. ఆ మధ్య ఈ సినిమాకు సంబంధించి ఎటువంటి వార్తలు వైరల్ అయ్యాయో తెలియంది కాదు. ఎన్నో ఆశలతో, అంచనాలతో ప్రేక్షకుల ముందకు వచ్చిన ఈ సినిమా.. సినిమాలోని హీరో పాత్రలానే.. ప్రేక్షకులకు మాటలు లేకుండా చేసింది. ఇక ఎగ్జిబిటర్స్‌ని అయితే రోడ్డున పడేలా చేసింది. ఈ సినిమాని కొన్న బయ్యర్లు, ఎగ్జిబిటర్లు భారీగా నష్టపోయారు. సినిమా విడుదల తర్వాత వచ్చిన టాక్‌తో.. అందరినీ ఆదుకుంటానని పూరి జగన్నాథ్ ముందే స్టేట్‌మెంట్ ఇచ్చారు.. కానీ ఆ తర్వాత ఏం చేసుకుంటారో చేసుకోండి.. ఒక్క రూపాయి కూడా ఇవ్వనంటూ రివర్స్ అయ్యారు. ఆ తర్వాత ఎలాగోలా విషయాన్ని చక్కబెట్టే ప్రయత్నం చేశారు. కొన్నాళ్లుగా ఈ విషయం కామ్‌గానే ఉంది. ఇప్పుడు పూరి తన తదుపరి ప్రాజెక్ట్‌ని మొదలు పెట్టేందుకు రెడీ అవుతుండటంతో.. ఇదే సరైన టైమ్ అని భావించిన బయ్యర్లు, ఎగ్జిబిటర్లు ధర్నాకు దిగారు. 'లైగర్ సినిమా బాధితులకు న్యాయం చేయండి. రిలే నిరవధిక దీక్షలు. 12-5-2023 నుంచి తెలంగాణ ఎగ్జిబిటర్స్ అండ్ లీజర్స్ అసోసియేషన్' అనే బ్యానర్లతో.. హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్ ఎదుట.. ఈ సినిమాని కొన్నవారంతా ధర్నాకు దిగారు. దీంతో మరోసారి 'లైగర్' సినిమా వార్తల్లో నిలిచింది. పూరీ జగన్నాథ్, విజయ్ దేవరకొండ వచ్చి మాకు న్యాయం చేయాలి. రూ. 9 కోట్లు ఇవ్వాలి.. లేదంటే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటామంటూ.. తెలంగాణ ఎగ్జిబిటర్స్ అండ్ లీజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ సినిమాను కొన్నవారు దీక్షకు దిగారు. దీంతో ఇప్పుడీ బాధితులను ఆదుకునేందుకు తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి పెద్దలు రంగంలోకి దిగినట్లుగా తెలుస్తోంది.

హిందీ హీరోలైతే వెనకాడతారు: హేమమాలిని

ముంబై: 'పుష్ప' సినిమాతో అల్లు అర్జున్ క్రేజ్ పాన్ ఇండియా స్థాయికి చేరుకుంది. ఆ చిత్రంలో ఆయన నటనకు, డైలాగ్ డెలివరీకి అభిమానులే కాదు అగ్ర నటీనటులు ఫిదా అయ్యారు. తాజాగా అల్లు అర్జున్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. అలనాటి బాలీవుడ్ హీరోయిన్ హేమమాలిని. బన్ని నటించిన పాత్రల గురించి ఆమె మాట్లాడారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో హేమమాలిని మాట్లాడుతూ "బన్నీ నటించిన 'పుష్ప' చిత్రమంటే నాకు చాలా ఇష్టం. పుష్పరాజ్‌గా అతని లుక్ చూసి ఆశ్చర్యపోయాను. 'పుష్ప' విడుదలయ్యాక అతని డాన్స్, మేనరిజంను ఎంతోమంది అనుకరించారు. సెలబ్రిటీలు సైతం డాన్స్ చేస్తూ ఎంజాయ్ చేశారు. గతంలో నేను చూసిన ఒక సినిమాలో అల్లు అర్జున్ చాలా అందంగా.. స్టైల్‌గా ఉన్నాడు. అలా ఉండే అతడు.. 'పుష్ప' కోసం పూర్తిగా తన లుక్‌ని మార్చేశాడు. లుంగీలో మాస్‌గా, డీ గ్లామర్‌గా కనిపించాడు. ఎలాంటి గెటప్ వేసినా అతడు హీరోలానే ఉంటాడు. అలా డీ గ్లామర్ రోల్ చేయడానికి అతను అంగీకరించడం గొప్ప విషయం. ఎంతో అభినందనీయం. హిందీ సినిమాల్లో హీరోలు అలా కనిపించడానికి, అలాంటి పాత్రలు చేయడానికి ఆలోచిస్తారు. ఒక సినిమాలో కాస్త నల్లగా కనిపించాలంటేనే ధర్మేంద్ర వెనకాడారు. ఆ విషయం నాకు ఇప్పటికీ గుర్తుంది" అని అన్నారు.

హీరోలను ప్రశ్నించగలరా? ఆలియా

ముంబై: ఆలియాభట్ ఎంత సాఫ్ట్‌గా కనిపిస్తారో... అంతే కోపమూ ఆమెలో ఉంది. ముఖ్యంగా మహిళలను ఎవరైనా వేలెత్తి చూపితే ఆమె అసలు ఊరుకోదు. వెంటనే కౌంటర్ ఇచ్చేస్తుంది. ఏ వేదికపైన అయినా ఆడవాళ్లను ఉద్దేశించి మాట్లాడకూడని విషయాలు, కించపరిచే వ్యాఖ్యలు చేస్తే ఆమె కోపం కట్టలు తెంచుకుంటుంది. తాజాగా ఇలాంటి పరిస్థితి ఆమెకు ఎదురైంది. "కెరీర్‌లో మంచి అవకాశాలు అందుకుంటూ, టర్నింగ్ పాయింట్‌గా ఉన్న సమయంలో తల్లి కావాలని ఎందుకు అనిపించింది? అని ఒకరు ప్రశ్నించారు. దీనికి ఆలియా ఆసక్తికర సమాధానం ఇచ్చారు. "ఇదే ప్రశ్న మీరు హీరోలను ఎందుకు అడగరు. వారి ముందు ఎందుకు అడగలేకపోతున్నారు. ఇప్పటివరకూ పాపకు సంబంధించిన చాలా విషయాలను రణ్‌బీర్‌ను అడిగారు. కానీ ఎప్పుడూ ఈ ప్రశ్న ఆయన్ని అడగలేదు. ఇలాంటి పిచ్చి ప్రశ్నలను హీరోయిన్లనే ఎందుకు అడుగుతారు. నేను కెరీర్ మొదలుపెట్టిన 10 ఏళ్లకు పిల్లని కన్నాను. నేను ఇప్పుడు మాతృత్వాన్ని ఆస్వాదిస్తున్నా. ఇది ఎంతో ఆనందంగా ఉంది. వ్యక్తిగత, వృత్తి పరమైన నిర్ణయం ఏది తీసుకున్నా.. అది సరైంది అనిపిస్తేనే ముందుకెళ్తాను. నాకు నచ్చకుండా ఏ పనీ చేయను. కథలు నచ్చక ఎన్నో పెద్ద సినిమాల అవకాశాలు వదులుకున్న సందర్భాలెన్నో ఉన్నాయి. మరోసారి ఇలా అడగకండి" అని ఘాటుగా స్పందించింది. నెపోటిజం గురించి కూడా ఆమె స్పందించారు.

డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ వాంగ్మూలం నమోదు

న్యూఢిల్లీ: మహిళా రెజ్లర్లు తనపై చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించి రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ వాంగ్మూలాన్ని ఢిల్లీ పోలీసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. డబ్ల్యూఎఫ్ఐ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్ వాంగ్మూలాన్ని కూడా నమోదు చేశారు. గత నెలలో బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఢిల్లీ పోలీసులు రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసిన విషయం తెలిసిందే. మొదటి ఎఫ్ఐఆర్ మైనర్ చేసిన ఆరోపణలకు సంబంధి చినది. ఇది లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ (పోక్సో) చట్టం కింద నమోదయింది. అలాగే భారతీయ శిక్షాస్మృతిలోని సంబంధిత సెక్షన్‌లతో పాటు ప్రవర్తనకు సంబంధించినది. ఇక అతని ప్రవర్తన గురించి పెద్దల ఫిర్యాదులపై నమోద యింది. విచారణలో పాల్గొనాల్సిందిగా సింగ్‌కు నోటీసు పంపారు. అతనిపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించి దాదాపు మూడు గంటల పాటు ప్రశ్నించినట్లు పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ కూడా అయిన సింగ్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇప్పటివరకు ప్రశ్నించింది. రెండు సందర్భాల్లోనూ అతను ఆరోపణలను ఖండించాడు. ఈ కేసులో తనను 'తప్పుడుగా ఇరికించారు' అని పేర్కొన్నాడని అధికారి చెప్పారు. డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు చేసిన వాదనలకు మద్దతుగా పత్రాలు లేదా రుజువులను సమర్పించాలని కోరినట్లు వివరించారు. ఇప్పటివరకు 30 మంది సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేశామని, మరిన్ని డాక్యుమెంట్లు చేయా ల్సి ఉన్నందున సింగ్‌ను మరింత విచారిం చనున్నట్లు పోలీసులు తెలిపారు. 'భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిపై వచ్చిన లైంగిక వేధింపుల ఫిర్యాదులపై విచారణకు ఏర్పాటు చేసిన పర్య వేక్షణ కమిటీ నివేదిక కూడా మాకు అందింది' అని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఈ కేసు విచారణలో భాగంగా ఢిల్లీ పోలీసులు అనేక బృందాలను ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, కర్నా టక, హరియాణా రాష్ట్రాలకు పంపి వాంగ్మూలాలు నమోదు చేసి ఆధారాలు సేకరించారు. ఇప్పటి వరకు, సింగ్ తనను లైంగికంగా వేధించాడని ఆరోపించిన మైనర్ వాంగ్మూలం మాత్రమే మేజిస్ట్రేట్ ముందు నమోదయింది. త్వరలో మిగిలిన ఆరుగురు మహిళా రెజ్లర్ల వాంగ్మూలా లను కూడా మేజిస్ట్రేట్ ముందు నమోదు చేయనున్నట్లు అధికారి తెలిపారు. అయితే సీఆర్‌పీసీ సెక్షన్ 161 కింద మైనర్‌తో సహా మొత్తం ఏడుగురు మహిళా ఫిర్యాదుదారుల వాంగ్మూలాలను పోలీసులు నమోదు చేశారు. ఈ కేసులను విచారించేందుకు సిట్‌ను ఏర్పాటు చేసినట్లు ఢిల్లీ పోలీసులు శుక్రవారం ఇక్కడి ప్రత్యేక కోర్టుకు తెలియజేశారు. స్టేటస్ రిపోర్టును దాఖలు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలకు ప్రతిస్పందనగా అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ హర్జీత్ సింగ్ జస్పాల్ ముందు ఈ వాదన జరిగింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అతుల్ శ్రీవాస్తవ వాదనలు వినిపిస్తూ, సీల్డ్ కవర్‌లో ఈ వ్యవహారంపై స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేశామని, కేసు స్వభావాన్ని పరిగణనలోకి తీసుకొని దానిని ఎవరితోనూ పంచుకోవద్దని కోర్టును అభ్యర్థించారు. వాదనల తర్వాత కోర్టు తదుపరి విచారణను మే 27కి వాయిదా వేసింది. విచారణను పర్యవేక్షించాలని, కోర్టు ముందు ఆరోపించిన బాధితుల వాంగ్మూలాన్ని నమోదు చేయాలని కోరుతూ రెజ్లర్లు దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేశారు. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 23 నుంచి అనేక మంది రెజ్లర్లు జంతర్ మంతర్ వద్ద బైఠాయించారు. వారికి సంఘీభావం తెలిపేందుకు రైతులు కూడా నిరసనకు దిగారు.

సీబీఎస్ఈ ఫలితాలు విడుదల

3 లక్షల విద్యార్థులకు 90 శాతం పైగా మార్కులు

న్యూఢిల్లీ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) 10వ తరగతి, 12వ తరగతి పరీక్షల్లో 3.08 లక్షల మంది విద్యార్థులు 90 శాతానికి పైగా మార్కులు సాధించగా, 66 వేల మందికి పైగా 95 శాతానికి పైగా స్కోర్లు సాధించినట్లు బోర్డు శుక్రవారం ప్రకటించింది. విద్యార్థుల మధ్య అనారోగ్యకర పోటీని నివారించేందుకు మెరిట్ జాబితాలను ప్రకటించడం, మార్కుల ఆధారంగా డివిజన్లు ఇచ్చే విధానాన్ని బోర్డు రద్దు చేసింది. 12వ తరగతిలో 1,12,838 (1.12 లక్షలు) మంది విద్యార్థులు 90 శాతానికి పైగా స్కోరు సాధించగా, 22,622 మంది అభ్యర్థులు 95 శాతానికి పైగా మార్కులు సాధించారు. అలాగే 10వ తరగతిలో 1,95,799 (1.95 లక్షలు) అభ్యర్థులు 90 శాతానికి పైగా మార్కులు సాధించగా, 44,297 మంది 95 శాతానికి పైగా మార్కులు సాధించారు. గత ఏడాదితో పోలిస్తే 5.38 శాతం క్షీణతతో 87.33 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో 12వ తరగతి ఫలితాలను సీబీఎస్ఈ ప్రకటించింది.

వచ్చే ఫిబ్రవరి 15 నుంచి 10, 12 పరీక్షలు

వచ్చే ఏడాది 10, 12 తరగతులకు సంబంధించిన బోర్డు పరీక్షలు ఫిబ్రవరి 15, 2024 నుంచి ప్రారంభమవుతాయని సీబీఎస్ఈ పరీక్ష కంట్రోలర్ సన్యాం భరద్వాజ్ శుక్రవారం ప్రకటించారు. విద్యా మంత్రిత్వ శాఖ అకడమిక్ క్యాలెండర్‌ను సమకాలీకరించడానికి, ప్రవేశ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు సహాయం చేయడానికి చాలా ముందుగానే పరీక్షల షెడ్యూల్‌లను ప్రకటించాలని నిర్ణయించింది.

విద్యార్థులను అభినందించిన ప్రధాని మోదీ

సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షల్లో విజయవంతంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం అభినందించారు, ఈ యువకుల కృషి, సంకల్పం కోసం తాను గర్విస్తు న్నానని ట్వీట్‌లో తెలిపారు. అలాగే యువకుల విజయంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయులను ఆయన అభినందిం చారు. '12వ తరగతి పరీక్షల్లో తాము మరింత మెరుగ్గా రాణించగలిగామని భావిస్తున్న ప్రకాశవం తమైన యువకులకు నేను చెప్పాలనుకుంటున్నాను. రాబోయే కాలంలో మీరు ఇంకా చాలా ఎదురు చూడాలి. ఒక సెట్ పరీక్షలు మిమ్మల్ని నిర్వచించవు. మీకు ఆసక్తి ఉన్న రంగాలలో మీ ప్రతిభను ఉపయోగించుకోండి. మీరు ప్రకాశిస్తారు' అని మోదీ మరో ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఒక పరీక్ష వ్యక్తి సామర్థ్యాన్ని నిర్వచించదు : కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రధాన్

'ఒక పరీక్ష వ్యక్తి సామర్థ్యాన్ని నిర్వచించదు. ఎప్పటికీ వదలని వారికి విజయం వస్తుంది' కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం అన్నారు. సీబీఎస్ఈ 10, 12వ తరగతి విద్యార్థుల ఫలితాల విడుదల తర్వాత ఆయన ఈ సందేశం పంపారు. 'సంవత్సరం పొడవునా మీరు చేసిన కష్టానికి సంబంధించిన ఫలాలను ఆస్వాదించడానికి ఇది ఒక క్షణం. సంతోషకరమైన, ప్రకాశవంతమైన భవిష్యత్తు కోసం శుభాకాంక్షలు. చాలా మంది స్నేహితులు (వారి) అంచనాలను అందుకోకపోవచ్చు. నేను వారికి విజ్ఞప్తి చేస్తున్నాను. హృదయాన్ని కోల్పోకుండా ఉండటానికి. ఒక పరీక్ష వ్యక్తి సామర్థ్యాన్ని నిర్వచించదు' అని ప్రధాన్ వరుస ట్వీట్లలో పేర్కొన్నారు. వారి అంచనాలను అందుకోలేకపోయిన స్నేహితులందరూ, నేర్చుకోవడానికి, ఎదగడానికి, బలంగా తిరిగి రావడానికి ఇది ఒక అవకాశంగా స్వీకరించమని నేను వారిని వేడుకుంటున్నానని తెలిపారు. 'ప్రయాణం ఇక్కడితో ముగియదు. పైకి లేచి మీరు విజయం సాధించే వరకు ముందుకు సాగండి. కష్టపడి పని చేస్తూనే ఉండండి. మీ కలలను వెంబడించండి. ఎప్పటికీ వదులుకోని వారికి విజయం వస్తుంది' అని ఆయన పేర్కొన్నారు. బోర్డు పరీక్షల్లో అబ్బాయిల కంటే బాలికలు మెరుగ్గా కొనసాగు తున్నారని మంత్రి ప్రశంసించారు.

ఉన్నతాధికారి బదిలీకి కేంద్రం తిరస్కృతి

కోర్టు ధిక్కరణ-సుప్రీంలో ఢిల్లీ సర్కార్

న్యూఢిల్లీ: ఢిల్లీలో స్థానిక ప్రభుత్వానికి పాలనాధికారాలు ఉంటాయని సర్వోన్నత న్యాయస్థానం తీర్పు చెప్పి 24 గంటలు గడిచేలోపే కేంద్రానికి, ఆప్ ప్రభుత్వానికి మధ్య అధికారాల తగాదా తెరపైకొచ్చింది. ఓ ఉన్నతాధికారి బదిలీకి కేంద్రం నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ ఆప్ ప్రభుత్వం శుక్రవారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఢిల్లీ ప్రభుత్వ సేవల శాఖ కార్యదర్శి బదిలీ నిర్ణయాన్ని అమలు చేయకుండా కేంద్రప్రభుత్వం అడ్డుకుంటున్నదని, ఇది సుప్రీంకోర్టు తాజా ఉత్తర్వులను ధిక్కరించడమేనని ఢిల్లీ ప్రభుత్వం వాదించింది. సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహా ధర్మాసనానికి ఢిల్లీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ఏఎం సింఘ్వీ కేసును వివరించారు. సర్వాధికారాలు స్థానిక ప్రభుత్వానికే అన్న తీర్పు వెలువరించిన మరునాడే ఆదేశాల ధిక్కరణ జరిగిందని కోర్టుకు తెలిపారు. రాజ్యాంగంలోని అధికరణ 141 ప్రకారం కోర్టు ఉత్తర్వుల ధిక్కరణపై అత్యవసర విచారణ చేపట్టాలని సింఘ్వీ కోరారు. 'ఎవరినీ బదిలీ చేయమంటున్నారు. తాజా తీర్పు దృష్ట్యా ధిక్కరణపై ఫిర్యాదు చేయొచ్చు. కానీ అందుకు సమయం పడుతుంది. కాబట్టి ఈ వ్యవహారాన్ని లిస్ట్ చేయండి' అని విన్నవించారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ ఈ వ్యవహారాన్ని వచ్చే వారంలో విచారించేందుకు ఓ ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తానని చెప్పారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.